


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 44, పేజీలు - 08
శుక్రవారం, జులై 18, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD






## నిమిష ప్రియది సున్నితమైన అంశం

2లో..



## హిమగిరుల్లో గర్జించిన ఆకాశ్

2లో..



## హైదరాబాద్ మెట్రో మొరాయింపు

2లో..



## నాటో చీఫ్ వార్నింగ్‌పై భారత్ స్పందన

2లో..

# కేటీఆర్ నాయకత్వాన్ని కవిత అంగీకరించటం లేదు

- కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషం పెట్టుకొని మాట్లాడుతోందని విమర్శ
- కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సూచనలు ఇస్తే స్వీకరిస్తామన్న సీఎం
- తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కోసం మహారాష్ట్రలో పర్యటిస్తానన్న రేవంత్ రెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ కీలక వ్యాఖ్యలు చేసారు. కేంద్రంతో కలిసి పని చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో రెండు మినహా మిగిలినవి కొనసాగుతాయని స్పష్టం చేసారు. నీటి సమస్యల పై చంద్రబాబుతో జరిగిన చర్చల పైన స్పందించారు. బీఆర్ఎస్ నేతల కేసుల విచారణ పైన ఆసక్తి కర విశ్లేషణ చేసిన రేవంత్.. కేటీఆర్, లోకేష్ రహస్య సమావేశం ఏంటని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సభకు రావాలని రేవంత్ ఆహ్వానించారు.



**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, టీడీపీ మంత్రి నారా లోకేష్ మధ్య జరిగినట్లు చెబుతున్న రహస్య భేటీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులతో సమావేశాల అనంతరం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ 'అర్ధరాత్రి లోకేష్‌తో డిన్నర్ మీటింగ్ ఎందుకు చేశారో కేటీఆర్ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. కేటీఆర్, లోకేష్ భేటీ గురించి కాంగ్రెస్ పార్టీ గతంలోనూ ఆరోపణలు చేసింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో టీడీపీ మద్దతు కోసం కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ ఎన్డీఏ అభ్యర్థి పోటీ చేసినా అతనికి మద్దతు ఇవ్వకుండా మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులకు టికెట్ ఇస్తే వారికే మద్దతు ఇవ్వాలని కేటీఆర్ కోరినట్లు సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. మాగంటి గోపీనాథ్, టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్నప్పటికీ.. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత బీఆర్ఎస్‌లో చేరి రెండుసార్లు విజయం సాధించారు. అయితే ఇటీవల ఆయన మరణించడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ ఆరోపణలపై ఇప్పటివరకు బీఆర్ఎస్ గానీ, టీడీపీ గానీ స్పందించలేదు. కేటీఆర్, లోకేష్ మధ్య భేటీ జరిగిందా లేదా అనేది అస్పష్టంగా ఉంది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఈ ఆరోపణలను చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. టీడీపీ సహకరిస్తేనే మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులకు టికెట్ ఇస్తామని లేదంటే ఇతరులకు ఇస్తామని కేటీఆర్ అన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇదే చిట్‌చాట్‌లో రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై కూడా విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో హడావుడి చేయడం లేదని, నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అన్ని విచారణలు పారదర్శకంగా జరుగుతాయని ఆయన హామీ ఇచ్చారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడేందుకు కిషన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన రేవంత్‌రెడ్డి, తాము మాత్రం ఈ కేసులను వదిలిపెట్టబోమని తేల్చి చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చురుకుగా సాగుతోందని, మరిన్ని అరెస్టులు కూడా ఉంటాయని ఆయన సంకేతాలు ఇచ్చారు.దతెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పాలనపై వస్తున్న విమర్శలకు దీటుగా స్పందించారు. ముఖ్యంగా బీజేపీ, బీఆర్ఎస్ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం కేంద్రంతో చర్చలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. 'ఇండియా, పాకిస్తాన్ మధ్యే నీటి పంపిణీపై చర్చలు జరుగుతుంటే, నేను పక్క రాష్ట్రం సీఎంతో మాట్లాడితే తప్పేంటి?' అని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి శాఖ ఎలాంటి చర్చలు జరగలేదని పేర్కొన్న సీఎం, ఇప్పటికే మూడు సమస్యలను పరిష్కరించామని తెలిపారు. మిగిలిన అంశాలపై అధికారులు, సాంకేతిక నిపుణుల కమిటీ చర్చిస్తుందని, 'నేను ఇంజనీర్‌ను కాదు సాంకేతిక అధ్యయనం తర్వాతే నిర్ణయం తీసుకుంటాం' అని వివరించారు. ప్రజలు తమకు అధికారం ఇచ్చారని, రాష్ట్ర సమస్యలను కేంద్రానికి చేరవేయడం తన బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. 'ఢిల్లీకి కాకుండా ఫామ్‌హౌస్‌కు వెళ్తే సమస్యలు పరిష్కారం కావు' అని పరోక్షంగా కేసీఆర్‌ను విమర్శించారు. నెలకు కనీసం రెండు సార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులతో సమన్వయం చేసుకుంటానని హామీ ఇచ్చారు.

### ప్రతిపక్షాలపై విమర్శల వర్షం..

ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో అసెంబ్లీలో చర్చకు సిద్ధమని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. 'కేటీఆర్ నాయకత్వాన్ని చెల్లెలే అంగీకరించడం లేదు. గతంలో సవాల్ విసిరితే పారిపోయారు' అంటూ కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. 'గంజాయి బ్యాచ్‌కి నేను భయపడను. భయపడితే నేను రేవంత్ రెడ్డి అవుతానా?' అంటూ ధ్వజమెత్తారు. బీసీ రిజర్వేషన్లపై తమదైన వ్యూహం ఉందని, కేటీఆర్ డ్రగ్స్ కేసుపై గత ప్రభుత్వ అవినీతిపై విచారణ జరుగుతుందని తెలిపారు. 'విలన్లు క్లైమాక్స్ లోనే అరెస్ట్ అవుతారు' అంటూ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. కిషన్ రెడ్డికి బీసీ రిజర్వేషన్లపై సవాల్ విసిరిన రేవంత్, ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంతో కలిసి పని చేస్తామని, కేసీఆర్ సభకు రావాలని ఆహ్వానించారు. తనపై ఉన్న కేసులపై తొందరపడబోనని, చట్టం తన పని తాను చేసుకుంటుందని, హడావుడి చేస్తే మీడియానే ప్రశ్నిస్తుందని అన్నారు. బీజేపీ సీబీఐ కేసుల పేరుతో రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. రెండేళ్ల తర్వాత కార్పొరేషన్ నామినేటెడ్ పోస్టులను తిరిగి భర్తీ చేస్తామని ప్రస్తుతం 65 కార్పొరేషన్లకు రెండేళ్ల పదవీకాలంతో నియామకాలు జరిగాయని సీఎం వెల్లడించారు.

## ఎయిరిండియా విమాన ప్రమాదం

### - నిరాధార వార్తలపై స్పందించిన ఏఏఐబీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనపై విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) ఇచ్చిన నివేదికపై విభిన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ఏఏఐబీ స్పందించింది. ఈ ప్రమాదానికి సంబంధించి

2లో..

## రేవంత్ రెడ్డి బలమైన, విజనరీ నాయకుడు

### - సీఎం కావాలని ఎన్నో ఏళ్లుగా రేవంత్ కోరుకున్నారని వెల్లడి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డిని పార్టీ హైకమాండ్ నిర్ణయించినప్పుడు జరిగిన పరిణామాలపై మంత్రి శ్రీధర్ బాబు

2లో..

# పొద్దుగాల గరంగరం.. సాయంత్రం భారీ వర్షం

### - రోడ్లన్నీ జలమయం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వేసవిలో మాదిరి తీవ్ర ఉక్కపోతతో అల్లాడుతున్న హైదరాబాద్ ప్రజలకు వరుణుడి రాకతో భారీ ఊరట లభించింది. గురువారం మధ్యాహ్నం తీవ్రస్థాయిలో ఎండ ఉండగా సాయంత్రం వాతావరణం చల్లబడి భారీ వర్షం కురిసింది. హైదరాబాద్ మొత్తం తడిసి ముద్దయ్యింది. కొన్ని రోజులుగా తీవ్ర వేడితో వేడెక్కిన హైదరాబాద్ ఈ వర్షంతో కొంత చల్లబడింది. వర్షం రాకతో వేడి నుంచి భారీ ఉపశమనం ఏర్పడింది. వర్షాకాలం ప్రారంభంలో దంచికొట్టిన వర్షాలు కొంత విరామం తీసుకుని గురువారం సాయంత్రం కొంత పడింది. హైదరాబాద్‌లోని

2లో..

# రాయలసీమ రతనాలసీమ చేస్తామనే ధైర్యం వచ్చింది

- హంద్రీ నీవా నీళ్లు విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద రెండు మోటార్లు ఆన్ చేసిన వైనం
- రైతన్నలకు మంచి చేసే కార్యక్రమం ఎప్పుడూ ప్రత్యేకమేనని వెల్లడి



**నంద్యాల (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీ-నీవా సుజల స్రావంతి ఫేజ్-1 కాలువల నీటిని విడుదల చేశారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద గురువారం నాడు రెండు మోటార్లను ఆన్ చేసి, శ్రీశైలం బ్యాక్‌వాటర్స్ నుంచి కృష్ణా నది జలాలను రాయలసీమ జిల్లాలకు తరలించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామనాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి తదితరులు పాల్గొన్నారు.

2లో..

# ఏపీలో 'హైటెక్ సిటీ'

### అమరావతి ఓఆర్ఆర్ వెంట ఏర్పాటు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో కూడా హైటెక్ సిటీ ఏర్పాటు అంశంపై మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర ప్రదేశ్-2047' లక్ష్యసాధన కోసం దేశంలో అగ్రశ్రేణి పారిశ్రామిక దిగ్గజాలతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి కోసం ఒక టాస్క్‌ఫోర్స్ కొన్ని సిఫార్సులు చేసింది. అమరావతి రింగ్ రోడ్డులో హైటెక్ సిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. కృత్రిమ మేధ (ఏఐ), సెమీ కండక్టర్ల వంటి అత్యాధునిక పరిశ్రమలను అభివృద్ధి చేయాలని సూచనలు చేసింది. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ ఈ నివేదికను రూపొందించగా

2లో..

# అనుమతుల కోసం విజ్ఞప్తి

### - అశ్వినీ వైష్ణవ్ తో సీఎం రేవంత్ భేటీ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సహకారాన్ని కోరుతూ కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కీలక భేటీ అయ్యారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నూతన ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం, అత్యాధునిక పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు తెలంగాణలో ఉన్నాయని పేర్కొంటూ, రాష్ట్రంలో సెమీకండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా ఆమోదం

2లో..

# బీఆర్ఎస్ వాళ్లు నా రూట్‌లోకి రావాల్సిందే

- తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు స్పందించలేదన్న కవిత
- గోదావరి జలాలను ఏపీకి రేవంత్, ఉత్తమ్ అప్పజెప్పి వచ్చారని మండిపాటు
- బనకచర్లను తక్షణమే ఆపకపోతే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరిక



తీన్మార్ మల్లన్న తనపై చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు స్పందించలేదని ఆ పార్టీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు తన దారికి రావాల్సిందేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్లపై రెండు బిల్లులు పెట్టాలని తొలుత డిమాండ్ చేసింది తానేనని కవిత చెప్పారు. న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాతే బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ నిర్ణయాన్ని సమర్థించినట్టు చెప్పారు.

2లో..

# నాపై ఒక్క డ్రగ్స్ కేసు అయినా ఉందా

### రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం రాజుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. "నాపై ఏదైనా డ్రగ్స్ కేసు నమోదై ఉందా? అలాంటి కేసులతో నాకు సంబంధాలు ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయా? అలాంటివి ఏమైనా ఉంటే దమ్ముంటే

2లో..

# బండి సంజయ్‌కి సిట్ పిలుపు

- కేసీఆర్ చేసిన పాపాల వల్ల నోటీసులు వచ్చాయన్న బండి
- తనకు తెలిసిన సమాచారాన్ని తెలియజేస్తానన్న బండి సంజయ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ కేసు విచారణ శరవేగంగా జరుగుతుంది. ఫోన్ ట్యాపింగ్‌పై అనుమానాలు ఉన్నవారు, ఆరోపణలు చేసిన వారి నుంచి సిట్ వాంగ్మూలం సేకరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని

2లో..

# నిమిష ప్రియది సున్నితమైన అంశం

**- విదేశాంగ శాఖ కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియ కేసుపై విదేశాంగ శాఖ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇది అత్యంత సున్నితమైన అంశమని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కేసులో నిమిష ప్రియకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. ఆమె కుటుంబం కోసం ఒక న్యాయవాదిని నియమించినట్లు ఆయన వెల్లడించారు. కేసు పురోగతి వివరాలను తెలుసుకోవడానికి దౌత్యపరంగా సహాయం అందిస్తున్నామని ఆయన అన్నారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనేలా స్థానిక అధికారులు, కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. ఈ ప్రయత్నాల ఫలితంగానే ఉరిశిక్ష వాయిదా పడిందని ఆయన గుర్తు చేశారు. యెమెన్ జాతీయుడి హత్య కేసులో నిమిష ప్రియకు అక్కడి అధికారులు ఉరిశిక్షను ఖరారు చేశారు. జూలై 16న అది అమలు కావాల్సి ఉండగా, కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలతో తాత్కాలికంగా వాయిదా పడింది. నిమిష, బాధిత కుటుంబాలు పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించుకునేందుకు మరింత సమయం కావాలని యెమెన్ ప్రభుత్వాన్ని భారత్ కోరింది. దీంతో ఉరిశిక్ష వాయిదా వేశారు.

# హిమగిరుల్లో గర్జించిన ఆకాశ్

**- ఆకాశ్ ప్రైమ్ మిసైల్ పరీక్ష సక్సెస్**

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పూర్తిస్థాయి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఆకాశ్ ప్రైమ్ డిఫెన్స్ వ్యవస్థను భారత సైన్యం విజయవంతంగా పరీక్షించింది. ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేధించే ఈ మిస్సైల్ వ్యవస్థను డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీఓ) అభివృద్ధి చేసింది. బుధవారం లడఖ్‌లోని 15 వేల అడుగుల ఎత్తులో ' ఆకాశ్ ప్రైమ్ ' మిసైల్ వ్యవస్థను పరీక్షించారు. ఈ వ్యవస్థ నిర్దేశిత రెండు హై-స్పీడ్ డ్రోన్లను విజయవంతంగా ధ్వంసం చేసింది. ఆకాశ్ ప్రైమ్ తన లక్ష్యాలను ఖచ్చితంగా ఛేదించి, భారత రక్షణ సామర్థ్యాన్ని చాటిచెప్పింది. ఆకాశ్ మార్క్-1, మార్క్-1ఎస్‌ల ఆధారంగా స్వదేశీయంగా దీనిని అభివృద్ధి చేశారు. మొత్తంలో 20 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేధించేలా ఆకాశ్ ప్రైమ్‌ను రూపొందించారు. 4,500 మీటర్లకు పైగా ఎత్తుల్లో పనిచేయగల సామర్థ్యం దీని సొంతం. 60 కిలోల వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలిగే మిస్సైల్ వ్యవస్థ 'ఫైర్ అండ్ ఫర్‌గెట్' విధానంలో పనిచేస్తుంది. టార్గెట్‌ను చివరి దశలో ట్రాక్ చేసి ధ్వంసం చేస్తుంది. ఇందులో ఆటోమేటిక్ టార్గెట్ డిటెక్షన్, ట్రాకింగ్, న్యూట్రలైజేషన్ వ్యవస్థ ఉన్నాయి. ఆర్మీ మూడో, నాలుగో ఆకాశ్ రెజిమెంట్లలో ప్రైమ్ క్షిపణులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మెరుగైన ఖచ్చితత్వం కోసం స్వదేశీ యాక్టివ్ రేడియో ఫ్రీక్వెన్సీ (ఆర్ఎఫ్) సీకర్‌ను అమర్చారు. భారత సైన్యం వెల్లడించిన వివరాల ప్రకారం భవిష్యత్తులో ఆకాశ్ ప్రైమ్ ఆధారంగా మూడు, నాలుగు రెజిమెంట్లుగా ఏర్పాటు చేయనున్నారు. ఇది సమర్థవంతమైన ఎయిర్ డిఫెన్స్ కోసం కీలక ఆయుధంగా మారబోతోంది. లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ మాట్లాడుతూ భారత గగనతల రక్షణ వ్యవస్థ ఉదాహరణగా క్రికెట్‌ను వివరించారు. భారీ ఎత్తులోప్రతికూల వాతావరణంలోనూ ఖచ్చితత్వంతో పని చేస్తుందని తెలిపారు. ఆకాష్ ప్రైమ్‌ను తొలిసారిగా సెప్టెంబర్ 2021లో ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి పరీక్షించారు.

# హైదరాబాద్ మెట్రో మొరాయింపు

**- మెట్రో స్టేషన్లలో ప్రయాణికుల ఇబ్బందులు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సాధారణంగా హైదరాబాద్ నగరంలో మెట్రో రైలు సేవలు సాఫీగా కొనసాగుతుంటాయి. కానీ, గురువారం సాయంత్రం నాగోల్- రాయదుర్గం మార్గం మెట్రో రైళ్లో సాంకేతిక లోపం కారణంగా ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఈ సమస్య వల్ల మెట్రో రైళ్లు ఆలస్యంగా నడవడంతోపాటు, రాయదుర్గం స్టేషన్‌లో సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. దీనికి తోడు, భారీ వర్షం నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగి స్టేషన్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. నాగోల్ నుంచి రాయదుర్గం వరకు నడిచే మెట్రో మార్గంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రైళ్ల షెడ్యూల్‌లో ఆటంకం ఏర్పడింది. సాధారణంగా క్రమం తప్పకుండా నడిచే ఈ రైళ్లు ఇప్పుడు 15 నిమిషాలకు పైగా ఆలస్యమయ్యాయి. రాయదుర్గం స్టేషన్‌లో మెట్రో సేవలు కొంత సమయం పాటు పూర్తిగా స్తంభించాయి. ఈ ఆటంకం వల్ల స్టేషన్‌లో ప్రయాణికులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వచ్చింది. భారీ వర్షం కారణంగా రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో, చాలా మంది మెట్రోనే ఆశ్రయించారు. అయితే, సాంకేతిక లోపం వల్ల వారి ప్రయాణం మరింత కష్టతరమైంది. టికెటింగ్ కౌంటర్ల వద్ద కిలోమీటర్ మేర ప్రయాణికులు బారులు తీరారు. గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులు ఈ ఆలస్యం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కారణంగా రోడ్డు రవాణా కూడా నత్తనడకన సాగడంతో, మెట్రోపై ఆధారపడిన వారు ఈ సమస్యతో మరింత ఇబ్బంది పడ్డారు. హైదరాబాద్ మెట్రో వేగవంతమైన, సౌకర్యవంతమైనదని చాల మంది మెట్రో ఎంచుకుంటారు, కానీ సాంకేతిక కారణాల వల్ల నిరాశకు గురయ్యారు, సాంకేతిక సమస్యలను త్వరగా పరిష్కరించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఆటంకాలు జరగకుండా చూడాలని మెట్రో అధికారులను ప్రజలు కోరారు.

# నాటో చీఫ్ వార్నింగ్‌పై భారత్ స్పందన

**- ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందన్న భారత విదేశాంగ శాఖ**

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రష్యాతో వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తే తీవ్ర ఆంక్షలు విధించే అవకాశం ఉందని నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) సెక్రటరీ జనరల్ మార్క్ రూట్ హెచ్చరించిన నేపథ్యంలో, భారత్ గట్టి స్పందనను వ్యక్తం చేసింది. ఈ విషయంపై ద్వంద్వ ప్రమాణాలను అనుసరించవద్దని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రంధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. భారత్‌కు ఇంధన భద్రత అత్యంత ప్రాధాన్యత అని, ఈ విషయంలో మార్కెట్‌లో అందుబాటులో ఉన్న అవకాశాలు మరియు ప్రపంచ పరిస్థితుల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటామని ఉద్ఘాటించారు. మార్క్ రూట్, అమెరికా సెనేటర్లతో కలిసి వాషింగ్టన్‌లో జరిగిన ఒక సమావేశంలో, భారత్, చైనా, బ్రెజిల్‌లు రష్యాతో వాణిజ్యాన్ని కొనసాగిస్తే 100 శాతం సెకండరీ ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్‌తో శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకోకపోతే ఈ ఆంక్షలు విధిస్తామని ఆయన తెలిపారు. ఈ హెచ్చరికలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల రష్యాతో వాణిజ్యం కొనసాగించే దేశాలపై కఠిన సుంకాలు విధిస్తామని చేసిన వ్యాఖ్యలకు అనుగుణంగా ఉన్నాయి. భారత్, రష్యా నుంచి డిస్కౌంట్ ధరలకు చమురు కొనుగోలు చేస్తూ, దేశీయ ద్రవ్యోల్బణాన్ని నియంత్రణలో ఉంచడంతో పాటు, ఆర్థిక వృద్ధిని నిలకడగా కొనసాగిస్తోంది. భారత్ 80 శాతం చమురు మరియు 50 శాతం సహజవాయువు దిగుమతులపై ఆధారపడుతుంది. ఈ నేపథ్యంలో, భారత్‌కు ఇంధన భద్రత కీలకం. అయితే, నాటో సభ్య దేశాలైన టర్కీ, హంగరీ, స్లోవాకియా వంటి దేశాలు కూడా రష్యా నుంచి ఇంధన దిగుమతులు చేస్తున్నాయని, వీటిపై నాటో మౌనంగా ఉంటోందని భారత్ గుర్తు చేసింది. ఈ ద్వంద్వ ప్రమాణాలపై జైస్వాల్ ప్రత్యేకంగా హెచ్చరించారు. కేంద్ర ఇంధన మంత్రి హర్దీప్ సింగ్ పురీ గతంలో, రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం వల్ల ప్రపంచ చమురు ధరలు స్థిరంగా ఉన్నాయని, లేకపోతే బ్యారెల్‌కు 120-130 డాలర్లకు చేరేవని వెల్లడించారు. ఈ సందర్భంగా, భారత్ తన ఇంధన వనరుల విషయంలో జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేసింది.

# బీఆర్ఎస్ వాళ్లు నా రూట్‌లోకి రావాల్సిందే

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వ హామీని నాడు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్వాగతించిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి తన సొంతింటి పార్టీపై సెటైర్లు వేస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతించింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వ ఆర్డినెన్స్ సరైందనేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. ఈరోజు హైదరాబాద్‌లో గురువారం ఎమ్మెల్సీ కవిత తన నివాసంలో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఆర్డినెన్స్ వద్దని బీఆర్ఎస్ నేతలు చెప్పడం తప్పంటూ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. నిపుణులతో చర్చించిన తర్వాతే తాను ఆర్డినెన్స్‌కు మద్దతు ఇచ్చానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత బిగ్ షాక్ ఇచ్చారు. బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో బీఆర్ఎస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టారు. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కరెక్టే అని.. బీఆర్ఎస్ వాళ్ళు ఆర్డినెన్స్ వద్దని చెప్తుండటం తప్పు అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీఆర్ఎస్ వాళ్ళు మెల్లగా తన దారికి రావాల్సిందేనంటూ చెప్పుకొచ్చారు. ఈ నిర్ణయంపై వారు నాలుగు రోజులు టైం తీసుకుంటారేమో అంటూ చమత్కరించారు. 2018 చట్ట సవరణ చేసి ఆర్డినెన్స్ తేవడం సబబే అని సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం బహిరంగ మద్దతు ప్రకటించారు. న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతే ఆర్డినెన్స్‌కు తాను మద్దతు ఇస్తున్నట్లు ఎమ్మెల్సీ కవిత చెప్పుకొచ్చారు. మరోవైపు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తనపై చేసిన వ్యాఖ్యలపైనా ఎమ్మెల్సీ కవిత స్పందించారు. మల్లన్న చేసిన కామెంట్స్‌కు బీఆర్ఎస్ పార్టీ రియాక్ట్ కాలేదని.. దానిని వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నానని ఎమ్మెల్సీ కవిత చెప్పుకొచ్చారు.

# ఎయిరిండియా విమాన ప్రమాదం

దర్యాప్తు కొనసాగుతోందని, దీనిపై ఇప్పుడే ఒక నిర్ధారణకు రావడం తొందరపాటు చర్య అవుతుందని అభిప్రాయపడింది. ఎయిరిండియా విమానం పైలట్ ఇంధన స్విచ్‌ను షట్ డౌన్ చేశారంటూ కొన్ని మీడియా కథనాలు ప్రచురించాయి. దీనిపై ఏఏఐబీ స్పందిస్తూ, కొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థలు నిరాధార, ధృవీకరించని నివేదికల ద్వారా విమాన ప్రమాదంపై ఒక నిర్ణయానికి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొంది. ఇటువంటి చర్యలు బాధ్యతారాహిత్యమైనవని స్పష్టం చేసింది. ఈ మేరకు ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిరాధార సమాచారంతో భారత విమానయాన రంగం భద్రత పట్ల ప్రజల్లో ఆందోళనను సృష్టించేందుకు ఇది తగిన సమయం కాదని ఏఏఐబీ పేర్కొంది. ప్రమాదానికి గల మూల కారణాలు, సిఫార్సులతో తుది నివేదికను విడుదల చేస్తామని స్పష్టం చేసింది. దర్యాప్తు విశ్వసనీయతను దెబ్బతీసే కథనాలను వ్యాప్తి చేయవద్దని సూచించింది.

# రేవంత్ రెడ్డి బలమైన, విజనరీ నాయకుడు

ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. రేవంత్ పేరును హైకమాండ్ నిర్ణయించినప్పుడు అందరం కలిసి పని చేయాలని, ఆ నాయకుడికి అన్ని విధాలా సహాయ సహకారాలను అందించాలని ఆలోచించామని చెప్పారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయాల మేరకే తామంతా నడుస్తామని అన్నారు. రేవంత్ రెడ్డి మంచి నాయకుడని, ప్రజలకు ఏదో ఒకటి చేయాలనే తపనతో ఉన్నారని చెప్పారు. గత ఏడాదిన్నర కాలంగా రేవంత్ ను దగ్గరగా ఉండి చూస్తున్నామని ఒక బలమైన, విజనరీ నాయకుడి లక్షణాలు రేవంత్ లో కనిపిస్తున్నాయని కితాబునిచ్చారు. సీఎం కావాలని ఎన్నో ఏళ్లుగా రేవంత్ కోరుకున్నారని ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి పట్టుదలతో శ్రమించారని తెలిపారు. దానికి తోడు ఆయన ప్లానింగ్, టైమ్, అవకాశాలు అన్నీ కలిసి వచ్చాయని చెప్పారు. ఇచ్చిన హామీలను ఒకటి తర్వాత మరొకటి పూర్తి చేసే పనిలో తాము ఉన్నామని తెలిపారు. ఆ లక్ష్య సాధనలో అనేక పాలసీ నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు.

## రాయలసీమ రతనాలసీమ చేస్తామనే ధైర్యం వచ్చింది

దీనిపై సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో హర్షం వ్యక్తం చేశారు. "మనసుకు చాలా సంతోషంగా, సంతృప్తిగా ఉంది. రాయలసీమ ప్రాంతానికి నీళ్లిచ్చి రైతన్నలకు మంచి చేసే కార్యక్రమంలో కలిగే సంతోషం ఎప్పుడూ ప్రత్యేకమే. రాయలసీమకు జీవనాడి హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు శరవేగంగా చేశాం. మొదటి ఫేజ్ పూర్తి చేసి మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి నీటిని విడుదల చేశాం. హంద్రీనీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 2200 క్యూసెక్కుల నుంచి 3850 క్యూసెక్కులకు పెంచడం వల్ల సీమ రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుంది. రికార్డు స్థాయిలో ఈ పనులు పూర్తి చేయడంలో భాగస్వాములు అయిన ప్రతి ఒక్కరికీ అభినందనలు, ధన్యవాదాలు. ఇదే స్ఫూర్తితో త్వరలోనే ఫేజ్ 2 పనులు పూర్తి చేద్దాం. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీటిని అందించే ప్రాజెక్టును పూర్తి చేస్తాం. నీళ్లిస్తే రైతులు బంగారం పండిస్తారు. సంపద సృష్టికి మూలమైన జలాన్ని ప్రతి ఎకరాకు అందిచాలనే సంకల్పాన్ని అందరి దీవెనలతో సహకారంతో నేరవేరుస్తాం. రైతన్నల సాగునీటి కష్టాలు తీర్చి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తాం" అని వివరించారు. హంద్రీ-నీవా ఫేజ్-1 కాలువల విస్తరణ పనులు పూర్తయ్యాయి, దీంతో కాలువ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెరిగింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాయలసీమలోని తాగునీటి, సాగునీటి కష్టాలను తీర్చడానికి 40 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉంది. ఈ నీరు నంద్యాల జిల్లా మల్యాల నుంచి అనంతపురం జిల్లాలోని జీడిపల్లి రిజర్వాయర్ వరకు తరలిస్తారు. గత ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా ఈ లక్ష్యం సాధ్యమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్ట్ కోసం రూ.3,890 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. వంద రోజుల్లోనే ఈ పనులను పూర్తి చేసిన కూటమి ప్రభుత్వం, రాయలసీమ ప్రజల నీటి నిరీక్షణను ముగించింది. ఈ ప్రాజెక్ట్ రాయలసీమలో సాగు, తాగునీటి సమస్యలను కొంతవరకు పరిష్కరిస్తుందని, రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని సీఎం వ్యాఖ్యానించారు. దీని ద్వారా రాయలసీమలోని గొల్లపల్లి, మరాల, చెర్లోపల్లి రిజర్వాయర్లు నిండనున్నాయి. అలాగే, జీడిపల్లి నీటిని పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు తరలించేందుకు 15 రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నారు. రాయలసీమలో నీటి సమృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

## పొద్దుగాల గరంగరం..సాయంత్రం భారీ వర్షం

పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. ఫిల్మ్ నగర్, మణికొండ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్షీకపూల్, నిజాంపేట, కంటోన్మెంట్, హకీంపేట తదితర ప్రాంతాల్లో వాన కురిసింది. దీంతో ఇళ్లకు చేరుకుంటున్న ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు పడ్డారు. ఒక్కసారిగా మారిన వాతావరణంతో ఉప్పల్, రామంతపూర్, మేడిపల్లి, బోడుప్పల్, పీర్జాదిగూడ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా వాహనదారులు, వ్యాపారస్తులు తీవ ఇబ్బందులకు గురయ్యారు. ప్రజలను జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. సుమారు రెండు గంటల నుంచి ఎడతెరిపి లేకుండా తార్నాక ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా తార్నాక, హబ్సిగూడ ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జాం ఏర్పడింది. కార్యాలయాలు, విద్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సికింద్రాబాద్, ఉప్పల్ వైపు వాహనాలు బారులు తీరాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

# నాపై ఒక్క డ్రగ్స్ కేసు అయినా ఉందా

బయటపెట్టు" అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. తనతో నేరుగా ఎదురెదురుగా మాట్లాడే ధైర్యం లేకపోవడంతో వెనకడుగున పేకాటాడుతున్నారని విమర్శించారు. చిట్టి చాట్లతో కాదు రేవంత్ గారు, నువ్వు నిజంగా నేత అయితే నన్ను నేరుగా ప్రశ్నించు అంటూ డేర్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో చిట్‌చాట్ పేరుతో తనపై అసత్య ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడటం రేవంత్ రెడ్డికి ఇది కొత్తేమీ కాదని విమర్శించారు. తనపై అసత్య ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డిని కోర్టుకు లాగుతానని హెచ్చరించారు. తప్పుడు ఆరోపణలకు మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. క్షమాపణలు చెప్పకుంటే పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

# అనుమతుల కోసం విజ్ఞప్తి

తెలపాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి రైల్ భవన్‌లో అశ్విని వైష్ణవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో ఏర్పాటు చేయతలపెట్టిన హైటెక్ ఎలక్ట్రానిక్ పార్కుకు సంబంధించి ఈఎంసీ 2.0 పథకం కింద తెలంగాణ అభ్యర్థనను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగ్ రోడ్డు సమీపంలో ఒక నూతన ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి అభ్యర్థనలకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

ముఖ్యంగా తెలంగాణలో ఉన్న అనుకూల వాతావరణాన్ని వివరిస్తూ, ప్రతిపాదిత అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ ప్రాజెక్ట్, మైక్రో లెడ్ డిస్‌ప్లే ఫ్యాబ్ ప్రాజెక్ట్ క్రిస్టల్ మ్యాట్రిక్స్‌కు తక్షణ ఆమోదం తెలపాలని రేవంత్‌రెడ్డి కోరారు. సెమీకండక్టర్ రంగంలో తెలంగాణ అగ్రగామిగా నిలిచేందుకు ఈ ప్రాజెక్టులు అత్యంత కీలకమని ఆయన చెప్పారు. తెలంగాణలో రైల్వే అనుసంధానతను పెంచేందుకు నూతన ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును ప్రతిపాదించినట్లు, దీనికి రైల్వే బోర్డు ఇప్పటికే ఫైనల్ లొకేషన్ సర్వేకు అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. సుమారు రూ.8 వేల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రైలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానం పెరగడంతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని, గ్రామీణ పేదరికం తగ్గి పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆయన వివరించారు.

అంతేకాకుండా హైదరాబాద్ డ్రైపోర్ట్ నుంచి బందర్ ఓడరేవుకు అనుసంధానంగా రైలుమార్గం మంజూరు చేయాలని ముఖ్యమంత్రి అభ్యర్థించారు. ఔషధాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తుల ఎగుమతులు, పలు దిగుమతులకు ఈ మార్గం అత్యంత కీలకమని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో రైల్వే ఆపరేషన్స్‌ను మరింత సమర్థంగా నిర్వహించేందుకు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కూడా రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రయాణికులకు భద్రత, వేగవంతమైన సేవలు అందించేందుకు ఇది అవసరమన్నారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల అనుసంధానం, పారిశ్రామిక, వ్యవసాయక ఎగుమతులు, దిగుమతులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నూతన రైలు మార్గాలకు సంబంధించి పలు ప్రతిపాదనలను అందించారు. ఇందులో భాగంగా వికారాబాద్ - కృష్ణా (122 కి.మీ. - రూ.2,677 కోట్లు), కల్వకుర్తి - మాచర్ల (100 కి.మీ. - రూ.2 వేల కోట్లు), డోర్నకల్ - గద్వాల (296 కి.మీ. - రూ.6,512 కోట్లు), డోర్నకల్ - మిర్యాలగూడ (97 కి.మీ. - రూ.2,184 కోట్లు) మార్గాలను వంద శాతం రైల్వే శాఖ వ్యయంతో మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు ఎంతో అవసరమని ముఖ్యమంత్రి చెప్పారు.

# ఏపీలో 'హైటెక్ సిటీ'

ఢిల్లీలో విడుదల చేశారు. టాస్క్‌ఫోర్స్ 360 పేజీల నివేదికను తయారు చేసింది. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్, డ్రోన్స్ రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపింది. తిరుపతి జిల్లాలోని 'శ్రీ సిటీ' తరహాలో ఇతర ప్రాంతాల్లో కూడా అభివృద్ధి చేయాలని సూచించింది. విశాఖపట్నం, అనంతపురం, తిరుపతిలో ఐటీ పార్కులు ఏర్పాటు చేయాలని పేర్కొంది. పరిశోధన సంస్థలకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని సిఫారసు చేసింది. అమరావతి చుట్టుపక్కల మెడిసిటీని అభివృద్ధి చేయాలని కూడా తెలిపింది. రాష్ట్రంలోని జిల్లాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచనలు చేసింది. విశాఖపట్నం, ఎన్టీఆర్, తిరుపతి వంటి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం వంటి రంగాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్ అంటే ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాలు తయారు చేసే పరిశ్రమలు వీటితో పాటు బ్లూ ఎకానమీ, రోబోటిక్స్, లైఫ్ సైన్సెస్, డేటా సెంటర్లు, లాజిస్టిక్స్, ఏఐ వంటి వాటిపై కూడా దృష్టి పెట్టాల్సి ఉంటుందని సూచనలు చేశారు. థీమ్ ఆధారిత పర్యాటకాన్ని అభివృద్ధి చేయడం నైపుణ్యాభివృద్ధి కూడా అవసరమన్నారు. పరిశ్రమల సమస్యలను పరిష్కరించడానికి ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలంటున్నారు. చంద్రబాబు ప్రతిపాదించిన పీ4 విధానం రాష్ట్ర అభివృద్ధికి చాలా ఉపయోగపడుతుందని ఇలాంటి మంచి ఆలోచనలను రాష్ట్రం వెంటనే తీసుకోవాల్నారు. 'ఆంధ్రప్రదేశ్ మెడికల్ టెక్నాలజీ జోన్ (ఏఎంటీజెడ్) ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలి. లైఫ్‌సైన్సెస్, టెక్నాలజీ రంగాల్లో మంచి అవకాశాలను అందుకోవడానికి ప్రపంచ స్థాయి సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయాలి. సెమీకండక్టర్లు, ఫ్యాబ్స్, డిస్‌ప్లే యూనిట్‌లు, ఎనర్జీ స్టోరేజ్, సోలార్ సెల్స్ వంటి ఆధునిక ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ పరిశ్రమలను నెలకొల్పడంపై శ్రద్ధ పెట్టాలి. అప్పులు అభివృద్ధికి అడ్డు రాకుండా చూసుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనేక అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయం, ఎలక్ట్రానిక్స్, జీవశాస్త్ర సాంకేతికత, లాజిస్టిక్స్, ఏరోస్పేస్, డిఫెన్స్, నీలి ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టవచ్చు' అంటున్నారు. మరి ఏపీ ప్రభుత్వం హైటెక్ సిటీ ఏర్పాటు సూచనపై ఎలా స్పందిస్తుందన్నది చూడాలి.

## బండి సంజయ్‌కి సిట్ పిలుపు

సిట్ అధికారులు విచారిస్తూనే ఉన్నారు. ఈ విచారణలో భాగంగా గతంలో తమ ఫోన్లు ట్యాపింగ్‌కు గురైనట్లు ఆరోపించి ఫిర్యాదు చేసిన నేతలకు సైతం సిట్ అధికారులు నోటీసులు ఇచ్చి వారి వాగ్మూలం రికార్డు చేస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈనెల 24న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే విచారణకు హాజరవుతానని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసుల నుంచి తనకు నోటీసులు వచ్చినట్లు తెలిపారు. తనతో పాటు తన కుటుంబం, సిబ్బంది ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. పడకగదిలో దంపతుల మాటలను కూడా ట్యాప్ చేసి జీవితాలను నాశనం చేశారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో నాకు తెలిసిన వాస్తవాలన్నీ సిట్ ముందుంచుతా అని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

### పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

మంచిర్యాల, : హాజీపూర్ మండలానికి చెందిన గుండా సునీత (36) పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై స్వరూప్ రాజ్ తెలిపారు. ముల్కల్ల గ్రామానికి చెందిన సమీప బంధువులైన ఇరువురు దంపతులు సునీతపై తీవ్ర ఆరోపణలు చేస్తూ మానసికంగా వేధించడమే కాకుండా ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు పేర్కొన్నారు. దీంతోఈనెల 15న పురుగుల మందు తాగింది. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని ఎస్ఐ వెల్లడించారు.

## రైలు నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు

చెన్నూరు, : జైపూర్ మండలం కిష్టాపూర్ కు చెందిన మాదాసు తరుణ్ రైలు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దపల్లి పోత్కపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్నగర్ వెళ్తున్న భాగ్యనగర్ ఎక్స్ప్రెస్ రైలు నుంచి రాత్రి పడి తీవ్రంగా గాయపడ్డాడు. తరుణ్ కు రెండు కాళ్లు విరగడంతో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### కాగజ్‌నగర్‌లో దంచి కొడుతున్న వాన

కాగజ్‌నగర్, : కాగజ్‌నగర్ పట్టణంలో గత అరగంట నుండీ వాన దంచి కొడుతుంది. గురువారం ఉదయం నుండి ఆకాశం మేఘావృతమై ఉండి ఒక్కసారిగా వర్షం ప్రారంభమైంది. భారీ వర్షనికి రహదారులు అన్నీ జలమయమయ్యాయి. ఒకేసారి వర్షం రావడంతో వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు తలోచోట తలదాచుకున్నారు. భారీ వర్షానికి పట్టణవాసులు ఇళ్ళకే పరిమితమయ్యారు.

## చెరువులో పడి బాలుడు మృతి

నిర్మల్, : ప్రమాదవశత్తు చెరువులో పడి బాలుడు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లా దిలావర్పూర్ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అశ్విత్ మతిస్థిమితం లేక నిన్నటి నుండి పుట్టినిల్లు వెతకగా కుడి చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## మేము తెలంగాణలోనే కొనసాగాలని కోరుకుంటున్నాం

ఆసిఫాబాద్, : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 14 గ్రామాలను కలిపేస్తున్నట్లు మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో గురువారం ఆసిఫాబాద్ జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు తమ అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. తాము పూర్తిగా తెలంగాణకే చెందినవారమని, ఓటు, ఆధార్, రేషన్ కార్డు అధికారిక గుర్తింపు పత్రాలు తెలంగాణవేఅని చెప్పారు. మహారాష్ట్రతో తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంటూ తెలంగాణలోనే కొనసాగించాలని అధికారులను ప్రార్థించారు.

## అలయంలో విశేష పూజలు

జగిత్యాల, : జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ కార్యవర్గం గురువారం స్వామి వారి పూజ కార్యక్రమాల అనంతరం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే ఉత్సవాలపై సమీక్షలో భాకంగా ఆగష్టు 12 మంగళవారం సంకటహర చతుర్థి సందర్భంగా మహలక్ష్మీ గణపతి స్వామి వారికి రాత్రి పంచామృత అభిషేకం, చక్కరాభిషేకం చంద్రోదయం అనంతరం అన్నప్రసాద వితరణగావిస్తారు.

## మార్కండేయ మందిర నిర్మాణానికి విరాళం అందించిన మట్టి చక్రపాణి

కోరుట్ల, జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో గురువారం మట్టి చక్రపాణి తండ్రి గంగారాం రూ 1, 00, 116 విరాళంగా ఇచ్చి శ్రీ శివ భక్త మార్కండేయ మందిర పునర్నిర్మాణంలో మహారాజ పోషకులుగా సభ్యత్వం తీసుకోవడం జరిగింది. మెట్ పల్లి పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు ధ్యావనపల్లి రాజారాం మాట్లాడుతూ వీరికి, వీరి కుటుంబ సభ్యులకు శ్రీ శివభక్త మార్కండేయ స్వామిశ్రీ లక్ష్మీ గణపతి శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాం అన్నారు.

## బీసీలపై కపటప్రేమ చూపుతున్నారు

వేములవాడ,: బీసీ బిల్లుపై కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కౌంటర్ ఇచ్చారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీసీలపై బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలు మొసలి కన్నీరు కారుస్తూ.. కపట ప్రేమ చూపుతున్నారని చెప్పారు. నిజంగా మీకు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే, కేంద్రంలో బిల్లులు ఆమోదించాలని చెప్పారు.

## సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డులు

ఇల్లందు,: పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా అర్జీలు పంపించారు. ఇల్లందు పట్టణంలోని జూనియర్ డిగ్రీ కాలేజీలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టి సీఎం రేవంత్ రెడ్డికి ఉత్తరాలు రాసి పంపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జె. గణేష్ మాట్లాడుతూ.. విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మర్చిపోయిందని అన్నారు.

## పోచారం మున్సిపాలిటీ లో పదవులు లేకున్న

# గత పాలకులదే హల్ చల్

- అక్రమ నిర్మాణాలు చుస్తే అధికారులు ఎలా వ్యవహారిస్తున్నారో ఈ ఫోటోలు చుస్తేనే అర్థం అవుతుంది
- మాజీలు అయినా కౌన్సిలర్స్, మేయర్ పోచారం మున్సిపాలిటీపై అధికారం చలామణి
- గత పాలకుల కనుసైగల్లో అధికారులు వత్తాసు పలకడం మామూళ్లకే నా.?
- మాజీ కౌన్సిలర్, మేయర్ చెప్పు చేతుల్లో ఇంకా మున్సిపల్ అధికారులు
- ప్రజల సొమ్ము మీకు కొంత మాకు కొంత అన్నట్టు వ్యవహరిస్తున్న గత పాలకులు



ఘట్కేసర్ ( ప్రశ్న న్యూస్) పోచారం మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలపై గత పాలకులే చలామణి అవుతు అధికారులకు

















కొంత వాటా మాజీ కౌన్సిలర్లకు కొంత వాటా అన్నట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత అవినీతి జరుగుతున్న స్పెషల్ ఆఫీసర్లు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో ఐదు సంవత్సరాలు మేయర్ కౌన్సిలర్లుగా పనిచేసిన గత పాలకులు పాలకవర్గం పదవీకాలం ముగిసిన ఇప్పటికీ అదే పద్ధతిలో అధికారులను చెప్పు చేతుల్లో పెట్టుకొని అక్రమ నిర్మాణాలు జోరుగా సాగిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదులు చేసిన ఎలాంటి ఫలితం లేదని, గత పాలకులు చెప్పినట్లుగానే మున్సిపల్ అధికారులు చేస్తున్నారని ఈ అక్రమ నిర్మాణాలను చూస్తేనే అర్థమవుతుందని స్థానికులు తెలిపారు. పోచారం మున్సిపల్ కార్యాలయంలో గత పాలకులు చెప్పిన పనులు అవుతున్నాయని లేకుంటే పనులు జరగడం లేదని రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని, ఎల్ఆర్ఎస్ పని కోసం వస్తున్న సదరు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోచారం మున్సిపల్ కార్యాలయంలో పాలకులు ఉన్నప్పుడు అక్రమ నిర్మాణాలే పాలకుల పదవీకాలం ముగిసిన అయిన సరే పాలకులదే మున్సిపల్ కార్యాలయంలో మాట చలామానితో అధికారులను శాసిస్తున్నారని పోచారం మున్సిపాలిటీ అధికారులు డ్యూటీ చేస్తున్నారా.? లేరా.? అన్న అనుమానం వస్తుందని ఒక పనిపై ఎన్నిసార్లు వెళ్లిన ఆ పని మాజీలు అయినటువంటి కౌన్సిలర్లు చెబితేనే పనులు జరుగుతున్నాయని సామాన్య ప్రజలు వెళితే అధికారులు పనులు చేయడం లేదని నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారని కార్యాలయానికి వస్తున్న సందర్శకులు తెలిపారు. గత పాలకులు పాలక వర్గం సమయంలో చలామణి అయింది సరిపోక ప్రస్తుతం ప్రత్యేక అధికారి పాలనలో గత పాలకుల చలామణి జరుగుతుందని ఇప్పటికైన ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టి గత పాలకుల మాటలు వినకుండా మున్సిపల్ చట్టం ప్రకారం అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు తెలిపారు. అక్రమ నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్న మాజీ కౌన్సిలర్లకు మున్సిపల్ అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు ముడుతున్నాయని అందుకే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ప్రభుత్వానికి లక్షలాది రూపాయలు నష్టం వాటిలేల అధికారుల పనితీరు ఉందని ఇలాంటి అధికారులపై ప్రభుత్వ పెద్దలు దృష్టి పెట్టి ప్రభుత్వానికి నష్టం చేసే అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని లేనట్లయితే ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లుతుందని అధికారుల అక్రమ నిర్మాణాలపై నిర్లక్ష్యం వహిస్తున్న వాటిని చూస్తేనే అర్థమవుతుందని ఇలాంటి అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వానికి నష్టం చేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. టీపీవో మంజు భార్గవి వివరణ కోరగా గతంలో నోటీసులు ఇచ్చామని వాటిని కూల్చుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూల్చివేతకు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో చూడాలి.

# వన్యప్రాణుల అరణ్యరోదన

- మాయమవుతున్న గుట్టలు, బలి అవుతున్న వన్యప్రాణులు
- జిల్లాలో వన్యప్రాణుల మనుగడకు పొంచి ఉన్న ముప్పు
- అర్ధరాత్రులు మట్టిని మాయం చేస్తూ వన్యప్రాణులను చంపుతున్న పట్టించుకునే నాధుడే లేడు
- మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్న అధికారులు





**సిరిసిల్ల(ప్రశ్న న్యూస్)** వాగులు నీళ్లను తాగవు, చెట్లు పండ్లను తినవు. ఏమాత్రం ఆశించకుండా పకృతి మనకు ఎంతో ఇస్తుంది. మనుషులు కూడా ప్రకృతితో మమేకమై జీవనం సాగిస్తే ఆయురారోగ్యాలతో సకల సౌకర్యాలతో జీవించవచ్చు. కానీ అక్రమార్కుల వక్రబుద్ధితో భూమాత అన్ని రకాల దోపిడీకి గురి అవుతుంది. జీవవైవిద్యాన్ని కాపాడాల్సిన మనుషులు అడవులను ధ్వంసం చేస్తూ, నీటిని కలుషితం చేస్తూ, మట్టిని కూడా వదలకుండా దోపిడీ చేస్తూ అనేక రకాలుగా పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారు. వినాశనాన్ని కొని తెచ్చుకుంటున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా గుట్ట బోర్ల తవ్వకాలు..

మట్టి మాఫియా ధన దాహానికి గుట్ట బోర్లు కరిగిపోతున్నాయి. ఇలాంటి అనుమతులు లేకపోయినా అక్రమంగా గుట్టను తవ్వి మట్టిని తరలించకపోతున్న అడిగే వారు లేరు. మట్టి మాఫియాకు రాజకీయ నాయకుల మద్దతు, మామూళ్ల మత్తులో అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ నిబంధనలను యదేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. గుట్ట బోర్లని ఆవాసంగా చేసుకుని జీవిస్తున్న వన్యప్రాణులు జెసిబి యంత్రాల శబ్దానికి, టిప్పర్ల రాకపోకలతో భయానక వాతావరణం ఏర్పడడంతో ప్రాణభయంతో పరుగులు తీస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయి వన్యప్రాణులు.

### అర్ధరాత్రి అయితే చాలు అటువైపు వెళ్లాలంటే భయపడుతున్న రైతులు..

భారీ యంత్రాల సహాయంతో గుట్టలను మాయం చేస్తున్నారు. అధికారుల అండదండతో మట్టి మాఫియా నిత్యం వాహనాలతో మట్టిని తరలిస్తూ లక్షలు గడిస్తున్నారు. స్వేచ్ఛగా తిరిగే వన్యప్రాణులు వాహనాల వెలుతురికి కళ్ళు బైర్లు కమ్మి పదుల సంఖ్యలో ఆగిన అడవి పందులను అత్యంత వేగంగా డి కొట్టడంతో చెల్లాచెదురుగా పడి ప్రాణాలు కోల్పోయిన మూగజీవాలు ఎన్నో. భారీ వాహనాల రాకపోకలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని భయపడి పొలాలకు వెళ్లడానికి భయపడుతున్న రైతన్నలు ఎందరో.

### అర్ధరాత్రి టిప్పర్లలో మట్టిని తరలిస్తే బెదిరించిన జర్నలిస్టులు..

ఎల్లారెడ్డిపేట మండలం కేంద్రంలో మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నా కొందరిని గుర్తించి కొందరు జర్నలిస్టులు చేతివాటం ప్రదర్శించి, అధికారుల పేరు చెప్పి వసూలు చేయడానికి ప్రయత్నించడంతో విషయం బయటకు పోకడంతో కేసులపాలై పరారైన వారు కూడా కొందరు జర్నలిస్టులు ఉన్నారు. మరికొంతమంది జర్నలిస్టులు అత్యుత్సాహంతో మరికొందరిని ఇరికించడానికి కుట్రలు పన్నినట్లు కూడా విశ్వాసనీయవర్గాల సమాచారం.

### అడవి పందిని ఢీ కొట్టి మాంసాన్ని కోసుకెళ్లారు..

ఆ అడవి పంది రాత్రి 2:45 నిమిషాల నుండి 3:00 గంటల సమయంలో రోడ్డు దాటుతుందని ఆ ప్రాంతంలో ఉన్న వ్యక్తి సమాచారం. ప్రతిరోజు లాగే మేత మేడం కోసం బయలుదేరిన అడవి పంది తిరిగి తన స్థావరానికి బయలుదేరుతున్న సమయంలో అతి వేగంగా అజాగ్రత్తగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో 70 నుండి 80 కేజీల అడవి పంది అక్కడికక్కడే చనిపోవడంతో మాంసాన్ని కోసుకొని వెళ్లి మిగతా కళేబరాన్ని రోడ్డు పక్కన పడవేసి వెళ్లారని స్థానికులు పేర్కొన్నారు. రక్తం రోడ్డు పైన ఉండడంతో టిప్పర్ లోని మట్టిని తీసి రక్తం పైన పోసి ఆనవాళ్లు లేకుండా చేసి వెళ్లారు. ఈ తతంగం అంతా తెలిసిన రైతన్నలు మనుషులను కూడా చంపితే ఇలాగే రోడ్డు పక్కన పడవేసిపోతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల కనుసనల్లోనే ఈ తతంగమంతా నడుస్తుందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మామూళ్ల మత్తులో ప్రాణాలతో చెలగాటమాడుతున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు.

## యూరియా కోసం రైతుల అవస్థలు

పరకాల, : హనుమకొండ జిల్లా పరకాలలో గురువారం యురియా కోసం రైతులు పడిగాపులు గాస్తున్నారు. తాము లైన్ లో నిలబడలేక లైన్ లో చెప్పులు పెట్టి యూరియా కోసం వేచి చూస్తున్నారు. యూరియా కొరత లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ తమ వంతు వరకు వస్తుందో లేదో అన్న అనుమానంతో రైతులు బారులు తీరుతున్నారు.

### యూరియా కోసం చెప్పులను

## క్యూ లైన్‌లో పెట్టిన్ రైతులు

జనగామ, : హన్మకొండ జిల్లా పరకాల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం యూరియా కోసం రైతులు, మహిళా రైతులు చెప్పులను క్యూ లైన్‌లో పెట్టి నానా అవస్థలు పడుతున్నారు. పొలం పనులు వదులుకొని రోజంతా తిప్పలు పడితే, రెండు యూరియా బస్తాలే ఇస్తున్నారని రైతులు, మహిళా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## షీటీం కార్యాలయం ప్రారంభించిన సీపీ

నర్సంపేట,: వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో గురువారం నూతన షి టీం కార్యాలయాన్ని వరంగల్ సీపీ సన్ ప్రిత్ సింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ, ఈస్ట్ జోన్ డీసీపీ, డివిజన్ పోలీస్ అధికారులు, షి టీం అధికారులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి సంబరాలలో పాల్గోన్న మంత్రి సీతక్క

ములుగు,: ములుగు జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్ లో గురువారం ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇందిరా మహిళా శక్తి సంబరాలకు మంత్రి సీతక్క ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు బ్యాంకు లింకేజీ చెక్స్ ని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, సెర్ఫ్ సీఈవో దివ్య, ములుగు కలెక్టర్ దివాకరతో కలిసి మంత్రి సీతక్క అందించారు.

## ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చేసే బాధ్యత మనది

వర్ధన్నపేట, : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హనుమకొండ పట్టణంలో ప్రజల అవసరాలకు నీరు ప్రధానంగా ఉంటదని అధికారులు, సిబ్బంది సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం వర్ధన్నపేట శాసన సభ్యులు కే ఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, నగర కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మరియు అధికారులతో కలసి వడ్డేపల్లి ఫిల్టర్ మరియు కాజీపేట వాటర్ ట్యాంక్ లను పరిశీలించారు. ఫిల్టర్ బెడ్ లోపల నీటి శుద్ధి పద్ధతిని, నిల్వ సామర్థ్యంలను క్షుణ్ణంగ పరిశీలించారు.

## సదాశివపేటలో ఘనంగా బోనాల జాతర



సంగారెడ్డి, : ఆషాఢమాస బోనాల ఉత్సవాల సందర్భంగా సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల కేంద్రంలో ఎంతో మహిమాన్వితమైన గ్రామ దేవత శ్రీ దుర్గా భవానీ బోనాల జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు తలపై బోనాలు ఉంచి శోభాయాత్ర నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ ముత్తైదు సౌభాగ్యాన్ని చల్లంగచూడమ్మా అంటూ మొక్కులు చెల్లించుకున్నారు.

## 578 పాఠశాలలకు వంట గ్యాస్ కనెక్షన్లు

ఆందోల్, : సంగారెడ్డి జిల్లాలోని 578 ప్రభుత్వ పాఠశాలలకు ఎల్పిజి గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని డీఈవో వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. త్వరలోనే పాఠశాలలకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్యాస్ కనెక్షన్లు రానుండడంతో పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే కార్మికులకు కట్టెల పొయ్యిల బాధలు తప్పనున్నాయని అన్నారు.

## నర్సాపూర్‌లో మంత్రి వివేక్‌కు తప్పిన ప్రమాదం

నర్సాపూర్, : మెదక్ జిల్లా నర్సాపూర్ లో గురువారం మంత్రి వివేక్ కారు ముందు వెళ్తున్న ఓ కారు సడెన్ బ్రేక్ వేయడంతో ఒకదానికొకటి 4 కార్లు ఢీ కొట్టుకున్నవి. నుజ్జునుజ్జైన కార్ల ముందు భాగం. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో కార్యకర్తలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పుల్లూరు టోల్ గేట్ సమీపంలో రోడ్డు ప్రమాదం

గద్వాల, : గట్టు మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పని నిమిత్తం కర్నూలుకు వెళ్లిన గొర్లఖాన్దొడ్డి గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు, కుర్వ నరసింహులు రాత్రి తిరిగివస్తుండగా, కర్నూలుకు చెందిన మరో బైక్‌తో ఢీకొన్నారు. రామాంజనేయులు (30) తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ముగ్గురిని ఆసుపత్రికి తరలించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



కొల్లాపూర్, : కొల్లాపూర్ మండలం చుక్కా పల్లి గ్రామానికి చెందిన ఉగ్గ వెన్నెలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 85, 500 చెక్కును కాంగ్రెస్ నాయకులు పసుపుల నరసింహ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు కొండంత అండ అని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి మహేష్ పాల్గొన్నారు.

### కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో

## ప్రత్యేక కార్యక్రమాలు

వనపర్తి, : వనపర్తి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆషాఢమాసం సందర్భంగా విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈరోజు గురువారం అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేపట్టారు. రేపు శుక్రవారం ఉదయం 10 గంటలకు భక్తులు సమర్పించిన కూరగాయలతో విశిష్ట అలంకరణ ఉంటుంది. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

# రామచంద్రరావు నేతృత్వంలో రాష్ట్రంలో భాజపా మరింత బలోపేతం కావాలి

**- భాజపా లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ : రేగుల రాజ్ కుమార్**

**- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు ఘన సన్మానం...! శుభాకాంక్షలు...!!**



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావును గురువారం హైదరాబాద్ లో గురువారం భాజపా లీగల్ సెల్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, ప్రముఖ న్యాయవాది రేగుల రాజ్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ, రామచంద్రరావు నాయకత్వంలో రాష్ట్ర బీజేపీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. పార్టీని బలంగా నిర్మించడంలో రాష్ట్ర లీగల్ సెల్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు.

# సీయన్బీకి"స్వచ్ఛ్ సర్వేక్షన్ అవార్డు": సిఇవో



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు మరో అరుదైన పురస్కారం లభించింది. కంటోన్మెంట్ ప్రాంతంలో పర్యావరణాన్ని పరిరక్షించడంలో కీలకంగా వ్యవహరించి ప్రజల్లో శుభ్రత పట్ల అవగాహన తీసుకురావడంలో విజయవంతమైనందున కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల శాఖ నుండి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డును సొంతం చేసుకున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ అధికారులు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో కేంద్ర గృహ నిర్మాణం




పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ చేతుల మీదుగా కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్ అవార్డు అందుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు ప్రధానోత్సవంలో నామినేటెడ్ సభ్యురాలు నర్మదా, డిప్యూటీ సీఈఓ పల్లవి, పారిశుధ్య విభాగ సూపరింటెండెంట్ అధికారి దేవేందర్ లు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న నాలుగు పదులు పైగా ఉన్న కంటోన్మెంట్ లలో ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు అవార్డు కైవసం చేసుకోవడం పట్ల కంటోన్మెంట్ బోర్డ్ సిఇవో మధుకర్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ ప్రాంతంలో చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ, రామన్నకుంట పునరుద్ధరణ, ప్రజల్లో పరిశుభ్రత పట్ల అవగాహన ర్యాలీలు నిర్వహించి, చైతన్యం తీసుకురావడంలో కంటోన్మెంట్ పారిశుధ్యవిభాగంలో తనదైన ముద్ర వేసుకుందన్నారు. రానున్న రోజుల్లో కంటోన్మెంట్ లో పర్యావరణ పరిరక్షణ నిమిత్తం వందలాది మొక్కలను నాటి. వాటిని పరిరక్షించే బాధ్యత భావితరాలకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# ఐఐటీ తిరుపతిలో కామన్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** వర్చువల్ గా ప్రారంభించిన కేంద్ర ఆహార ప్రాసెసింగ్ మంత్రి చిరాగ్ పాశ్వాన్ పాల్గొన్న శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు నేను ఐఐటీలో ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నాను నాడు మా తండ్రిగారైన బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఇదే ఐఐటీకి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు అని తెలిపారు, ఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా యువతకు స్వంతంగా ఉపాధి కల్పించే స్థాయికి వెళుతుందని, రైతులకు ఉపయోగపడే మరిన్ని కోల్డ్ స్టోరేజీలు గోడౌన్లు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఐఐటి తిరుపతి డైరెక్టర్, ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏటిఎం గుట్టురట్టు,కట్టల నోట్లు భద్రం:డిసిపి

**- "ఏటిఎం చోరీ కేసును ఛేదించిన సైబరాబాద్ పోలీసులు - నార్త్ దొంగల ఆటలు కట్టు, ఏటిఎం పైసలు స్వాధీనం:**

**- గచ్చిబౌలి సైబరాబాద్ కమిషనర్ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హెచ్డీఎఫ్సీ ఏటిఎం చోరీ కేసు ఛేదించిన పోలీసులు**






**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశం అభివృద్ధి బాటలో దూసుకుపోతుంది. డెవలప్మెంట్ కి సమానంగా నేరాలు కూడా చేతులు చాపుతున్నాయి. దినికి తోడు దక్షణ భారత ప్రాంతంలో భారీ చోరీలకు ఉత్తర భారతీయులు స్కెచ్ వేస్తున్నారు. ప్రతి సారి అంతరాష్ట్ర ముఠాలకు చెక్ పెడుతున్నప్పటికి ఏదో మూల చోరీలకు పాల్పడడం వీరికి పరిపాటైంది. ఇదిలా ఉంటే దేశంలోనే నెంబర్ వన్ గా ఉన్న తెలంగాణ పోలీసులు. ఈ విషయాన్ని గతంలో పలు సందర్భాల్లో కేంద్రం హోంశాఖ తెలంగాణ పోలీసుల పని తీరును మెచ్చుకోవడం తెలిసిన విషయమే! అదిగాక దేశంలో ఉన్న ఇరవై తొమ్మిది రాష్ట్రాల్లో కొన్ని రాష్ట్రాల నగరాలు మెట్రో పాలిటిన్ సిటిలా మారుతున్నాయి. దినం దినం మహానగరాల్లో ప్రజల నిష్పత్తి గణనీయంగా పెరగతుండంతో అధికారులు నేరాలు ఘోరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో (ఆర్టిఫీషియల్ ఇంటిలేజన్స్) దొంగల ఆటలకు అడ్డు కట్ట వేస్తున్నారు పోలీసులు. ప్రపంచమే అరిచేతులో ఉన్నట్లు, ఫోన్ లో కొత్త కొత్త యాప్స్ నేరాలను ప్రొత్సహిస్తుంది. దీనికి తోడు అడ్డదారిలో డబ్బు సంపాదించాలనే ధ్యేయంగా కొంతమంది అంతరాష్ట్ర ముఠాలు నేరాలకు పాల్పడుతున్నారు. ప్రతి నేరం సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో చోరీలకు తెగ పడుతున్నట్లు దర్యాప్తుల్లో వెల్లడైంది. తెలంగాణ రాష్ట్రంలో చోరీలు, హత్య పథకాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని అత్యాధునిక టెక్నాలజీతో అసాంఘిక శక్తులను అదుపులోకి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో ఉన్న ఐదు కమిషనరేట్ పరిధిలో ఏ నేరం చోటు చేసుకున్న కొన్ని ఘడియల్లోనే నేరస్తులను పసికడుతున్న హైదరాబాద్ పోలీస్. అందుకే దేశంలో ఏమూల నేరం జరిగిన దాని నమూనాలు హైదరాబాద్ ఫోరెన్సిక్ నిపుణులు సహాయంతో చిక్కు ముడులు విప్పుతారు మన గ్రేట్ తెలంగాణ రాష్ట్ర పోలీసులు. ఈ నెల 8, 9 తేదీల్లో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న హెచ్డీఎఫ్సీ ఏటిఎం చోరీ కేసును సైబరాబాద్ పోలీసులు ఛేదించారు. ఈ నేరానికి సంబంధించిన పూర్తి వివరాలను బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆయనమాట్లాడుతూ జూలై 8న ఏటిఎం నుంచి పొగలు వస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏటిఎంలో చోరీ జరిగిన ప్రాంతంలో నమూనాలు సేకరిస్తూ, అలాగే దర్యాప్తులో గ్యాస్ కట్టర్స్ సాయంతో ఏటిఎం తెరిచి చోరీ చేసినట్లు గుర్తించిన పోలీస్ అధికారులు. సాధారణంగా బ్యాంకుల్లో అలారంలు గట్టిగా మోగాల్సినప్పటికీ, దోపిడీదారులు ప్రత్యేకంగా అలారం సెన్సర్లను పనిచేయకుండా చేసి అత్యాధునిక పద్ధతిలో దొంగతనానికి పాల్పడ్డారని డిసిపి పేర్కొన్నారు. హెచ్డీఎఫ్సీ ఏటిఎం చోరీ కేసులో మొత్తం నగదు రూ. 34.71 లక్షల రూపాయలు చోరీకి గురైనట్లు దర్యాప్తులో వెల్లడైంది. పోలీస్ ఉన్నతాధికారులు ఈ కేసు ఛేదించడానికి ఏడు పోలీస్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించారు. దర్యాప్తు నేపథ్యంలో కేసు విచారణలో నిందితులు హర్యానా రాష్ట్రానికి చెందినవారని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మరో ట్విస్ట్ ఏమిటంటే కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో నిందితుల్లో ఒకరు సికింద్రాబాద్ బేగంపేట ప్రకాష్నగర్ ప్రాంతంలో ఒక పీజీ హాస్టల్లో ఓ నిందితుడిని పెట్టుకున్నారని డిసిపి పేర్కొన్నారు. ఆ ప్రాంతం నుండి గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ కట్టర్లు, రూ. 17 లక్షల నగదును నిందితుడు నుంచి స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. అదిగాక ఈ కేసులో మరో ముగ్గురిని యాసిబ్ హుస్సేన్, అమీర్ హన్సారీ, ఎండి అబేద్లను అరెస్టు చేశామన్నారు. విచారణలో వెలుగులోకి వచ్చిన ఆశ్చర్యమైన నిజాలు నిందితులు ఓ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న సమయంలోనే ఒకరితో ఒకరు పరిచయమై, విడుదలయ్యాక పెద్ద చోరీకి ప్లాన్ చేయాలనేది వారి ఆలోచన ఈ నేపథ్యంలో అందురు కలసి ప్లాన్ చేసినట్లు పోలీసులు విచారణలో వెల్లడైందని అధికారులు వెల్లడించారు. జీడిమెట్ల గాజులరామారం ఏటీఎం దోపిడీ కేసులో కూడా వీరి ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఇవే కాక, నిందితులపై గతంలో 30కి పైగా కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందుతులను అరెస్ట్ చేసి నాలుగు ద్విచక్ర వాహనాలతో పాటు 17లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఏటీఎంలలో చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసిన సైబరాబాద్ పోలీసులు. హర్యానాకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు. నిందితుల వద్ద నుండి 17 లక్షల రూపాయల నగదు, చోరీకి ఉపయోగించిన పరికరాలు గ్యాస్ కట్టింగ్ మెషిన్ లు, 4 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసిన పోలీసులు. బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 8,9 న అర్ధ రాత్రి సమయంలో జీడిమెట్ల మార్కండేయ నగర్ లోని హెచ్డిఎఫ్సి బ్యాంకు ఏటీఎంలో చోరీకి పాల్పడ్డ ముఠా. వేంటనే పోలీసులకు సమాచారం అందించిన బ్యాంకు సిబ్బంది. నిందితుల కోసం 7 ప్రత్యేక టీమ్ లు ఏర్పాటు చేశారు. గ్యాస్ కట్టర్ ల సహాయంతో చోరికి పాల్పడ్డారని గుర్తించిన పోలీసులు. ఏటీఎంలోని 34 లక్షల 71 వేల రూపాయలు దోచుకున్న అంతరాష్ట్ర ముఠా. చోరీ ఏ విధంగా జరిగిందో సీసీటీవీ కెమెరాల ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు పోలీసులు. చోరికి పాల్పడ్డది హర్యానాకు చెందిన ముఠాగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైందని అధికారులు తెలిపారు. అలాగే సికింద్రాబాద్ బేగంపేట ప్రకాశ్ నగర్ లో గ్యాస్ కట్టర్ లను కోనుగోలు చేసిన ముఠాను గుర్తించిన పోలీసులు. చోరికి పాల్గొన్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నాం. నిందితుల వద్ద 17 లక్షల రూపాయల నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని, మరో వ్యక్తి మధ్యప్రదేశ్ లో పోక్సో కేసులో జైలుకి వెళ్లిన నిందితుడు అమీర్ అన్సారీ. మధ్యప్రదేశ్ జైలులో ఉన్న యాసిద్ హుస్సేన్, ఎండి అబెద్ లకు అమిద్ అన్సారీ పరిచయం. ఈ ముగ్గురు నిందితులు ఒక ముఠాగా ఏర్పడి హైదరాబాద్ నగరంలో చోరీలకు స్కెచ్ వేసినట్లు విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం అదుపులో ఉన్న ఈ నిందితుల పై సుమారు 30 కి పైగా ఏటీఎం, హౌస్ బ్రేకింగ్ చోరీ కేసులు నమోదయ్యాయి అని పోలీస్ అధికారులు తెలిపారు.

# ట్రాఫిక్ మళ్లింపు: ప్రజలు సహకరించండి: డిఎస్పీ



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తిలో జరిగే ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఉత్సవాల నిర్వహణకు ప్రజలు పోలీసులతో సహకరించాలని శ్రీకాళహస్తి డిఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం, ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా ట్రాఫిక్ ను మళ్లీస్తున్నట్లు వివరించారు. ప్రజలు పోలీసులతో సహకరించాలని కోరారు. ఆదివారం ఒక్కరోజు మాత్రం పట్టణంలోనికి వచ్చే బస్సులను ఏపీసిడ్స్ నుంచి మళ్లీ స్తున్నట్లు తెలిపారు. అలాగే ఇతర డిపోల బస్సులు బైపాస్ నుంచి వెళ్లాలని సూచించారు. శ్రీకాళహస్తి డిపోకు చెందిన తిరుపతి వెంకటగిరి మార్గాల్లో వెళ్లే బస్సులను స్వర్ణముఖి బస్ స్టాప్ నుంచి ఆపరేట్ చేయాలని ఆర్టీసీ అధికారులను సూచించినట్లు వివరించారు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు రిపబ్లిక్ క్లబ్ మీదుగా వచ్చే ఆటోలు కార్లు ద్విచక్ర వాహనాల చోధకులు ఒక్కరోజు అగ్నిమాపక కేంద్రం నుంచి మళ్లించబడిందన్నారు. కొత్తపేట వైపు నుంచి వచ్చే కార్లు ఆటోలు ద్విచక్ర వాహనాలు తమ దిశను మార్చుకోవాలని సూచించారు. పట్టణంలోని కృష్ణారెడ్డి మండపం వద్ద నుంచి వచ్చే వాహనాలను పెండ్లి మండపం కూడలి నుంచి నగరి వీధి, ముత్యాలమ్మ గుడి వీదుల మీదుగా మళ్లించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి తిరుపతి వైపు వెళ్లే బస్సులను కారులను చెన్నై నుంచి తిరుపతికి వెళ్ళు బస్సులను విఎంసి సర్కిల్, జయ రామారావు వీధి, గాలి గోపురం, జల వినాయక ఆలయం నుంచి మళ్లించినట్లు పోలీస్ అధికారులు వివరించారు. ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు సుమారు 150 మంది పోలీసులను బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల భద్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో సుమారు 70 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డ్రోన్ కెమెరాలతో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకున్నాము. ఆపరేట్ చేయటానికి పోలీస్ స్టేషన్ లో కంట్రోల్ రూం ను ఏర్పాటు చేస్తామన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో ఐఐటి



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో ఐఐటి తిరుపతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్బును ప్రారంభించనున్నారు, సదరు కార్యక్రమానికి తిరుపతి జిల్లా జెసి తో కలిసి పర్యటించిన శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి.

# వేములవాడలో ఉజ్జయిని మహాకాళి ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం

**- నేటి నుండి ఈనెల 20 వరకు ఘనంగా ఉత్సవాలు**

**- భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలి**

**- ఆలయ కమిటీ సభ్యులు**




**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలోని బ్రిడ్జి సమీపంలో వెలసిన "శ్రీ ఉజ్జయిని మహాకాళి"అమ్మవారి ఆలయంలో 14వ వార్షికోత్సవ వేడుకలు నేటి (శుక్రవారం) నుండి ఆరంభమవుతాయని, మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## ఉత్సవ వేడుకల వివరాలు

**-జూలై 18 (శుక్రవారం)న అమ్మవారికి విశేష అభిషేకాలు, పుష్పాభిషేకాలు.**

**- జూలై 19 (శనివారం)న అమ్మవారు శాఖాఅంబరి అవతారంలో భక్తులకు దర్శనం.**

**- జూలై 20 (ఆదివారం)న ఘనంగా బోనాల సమర్పణ**

మొక్కులు చెల్లించే భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడే అవకాశం ఉంది. అదే రోజు సాయంత్రం అమ్మవారి శోభాయాత్ర నిర్వహించనున్నామని, గొర్రె పోతుల పలహార బండి, పోతురాజుల విన్యాసాలు, మహిళా కళాకారుల డప్పు చప్పుళ్ళ మేళతో పట్టణ పుర వీధుల గుండా ఊరేగింపు జరుగుతుందని, ఈ వేడుకల్లో సమస్త భక్తజనాలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కమిటీ సభ్యులు కోరారు.

## ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమం అందేలా ప్రజా ప్రభుత్వం చర్యలు

- రేషన్ కార్డుతో పేద కుటుంబాలకు రూ.10 లక్షల కవరేజ్‌తో ఆరోగ్యశ్రీ లబ్ధి
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే: ఆది శ్రీనివాస్
- వేములవాడ లో నూతన రేషన్ కార్డులు పంపిణీ



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. గురువారం వేములవాడ పట్టణంలోని మహా లింగేశ్వర గార్డెన్స్‌లో నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ ప్రయోజనం వర్తిస్తుంది. అలాగే సొంత ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నాం," అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, వడ్డీ లేని రుణాలు, మహిళా బీమా, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల వివరాలు వెల్లడించారు. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారని విమర్శించిన ఆయన, ప్రజలకు ఇచ్చిన ఒక్కో హామీని నెరవేరుస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, "వేములవాడ అర్బన్‌లో 353, రూరల్‌లో 174 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. సిరిసిల్ల జిల్లాలో మొత్తం 14 వేల మందికి కార్డులు అందించనున్నాం," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, డిఎం సివిల్ సప్లై రజిత, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో జిహెచ్ఎంసి సమీక్ష సమావేశం

- హైడ్రా కమిషనర్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆధ్వర్యంలో



**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయంలో గురువారం రోజున జిహెచ్ఎంసి కమిషనర్, వాటర్ సప్లై అండ్ సేవరేజ్ బోర్డు (హైడ్రా) కమిషనర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నగర శుభ్రత, డ్రైనేజీ సమస్యలు, చెట్టు కొమ్మల తొలగింపు, వర్షపు కాలంలో తక్కువ ప్రదేశాలలో నీటి నిల్వలు వంటి అంశాలపై చర్చించబడింది. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్లు సూచించారు.

## ఓయూ ఎస్. బి.ఐ బ్యాంక్ మేనేజర్ గా నుతనంగా వచ్చిన గణపతి

- సత్కరించిన ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి



**ఓయూ (ప్రశ్న న్యూస్)** ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ నూతన మేనేజర్ గా నియమితులైన గణపతి ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి. ఈ సందర్భంగా కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ ఉస్మాని యా యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు ఎస్ బి.ఐ బ్యాంకు లో బ్యాంకు ఖాతాలు, కళాశా లకు సంబంధించిన మెస్ డిడి లు, కళాశాల ఫీజు డీడీలు, ఇతర బ్యాంకు సర్వీసులలను సకాలం లో అందించి విద్యార్థులకు సహకరించాలని నూతనంగా వచ్చిన మేనేజర్ ని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన మేనేజర్ విద్యార్థులకు, ప్రజలకు బ్యాంక్ సేవలను అందేలా తమ వం తు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో రాజేందర్, శివాజీ, స్వామి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మార్గం చెందిన సంఘటన గురువారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ చెక్ పోస్ట్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు ప్రమాదం ద్విచక్ర వాహనం మీద వెళుతున్న మెదక్ జిల్లా చేగుంట గ్రామానికి చెందిన రాములు (55) అనే వ్యక్తి టీజీ 11టీ 1851 అనే నంబర్ గల ట్యాంకర్ కింద పడడంతో తల మీద నుండి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి పెట్రోల్ బంక్ లో నుండి ఓ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ట్యాంకర్ కింద పడి మృతి చెందినట్లు ట్యాంకర్ డ్రైవర్ సురేందర్ తెలిపారు. కండ్లకోయ నుండి చేగుంట వైపు వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. కాగా మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న మేడ్చల్ పోలీసులు.

## ఉప్పల్ సర్కిల్ ఉప కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన గోధుమల రాజు గంగపుత్ర

– సత్కరించిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



హైదరాబాద్(ప్రశ్న న్యూస్ )మల్కాజిగిరి సర్కిల్ జిహెచ్ఎంసి ఉప్పల్ సర్కిల్ కు బదిలీ పై వచ్చి ఉప్పల్ సర్కిల్ ఉప కమిషనర్ గా గోధుమల రాజు గంగపుత్ర బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలసిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర జిహెచ్ఎంసి ఉప్పల్ సర్కిల్ ఉప కమిషనర్ గోధుమల రాజు గంగపుత్రకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచు గోధుమల రాజు గంగపుత్ర నిరుపేద సంప్రదాయ మత్యకార కులములో జన్మించి ఈ స్థాయికి ఎదగడం శుభపరిణామన్నారు. రాజు గంగపుత్ర రానున్న రోజులలో సామాజిక కార్యక్రమాలతో పాటు వయో వృద్ధులు, ప్రతిభ కలిగిన నిరుపేద గంగపుత్ర విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తూ మరింత ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు.

## నిబంధనల ప్రకారమే ఎరువులు.. విత్తనాలు విక్రయించాలి

- స్టాక్,సేల్స్ రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలి
- నకిలీ ఎరువులు,విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ : సందీప్ కుమార్ ఝా
- చందుర్తి లో ఎరువులు, విత్తనాల దుకాణాలు ఆకస్మిక తనిఖీ



**చందుర్తి,(ప్రశ్న న్యూస్)** చందుర్తి మండలంలోని మరిగడ్డ శ్రీ పవన కుమార ఫెర్టిలైజర్ దుకాణం,చందుర్తి మండల కేంద్రం,సనుగుల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాలు దుకాణాల్లో నిలువలు పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలోని సేల్స్, స్టాక్ రిజిస్టర్ పరిశీలించి గోదాం ను తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు,ఎరువులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు అందజేయాలని సూచించారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని యజమానులను కలెక్టర్ హెచ్చరించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సంబంధిత శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు నాంది పలికిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

- స్కిల్ డెవలప్మెంట్ సెమినార్ గోడ ప్రతి ఆవిష్కరణ



**గంగాధర,(ప్రశ్న న్యూస్)** మహిళా సాధికారత లక్ష్యంగా మహిళలకు సమాజంలో సమాన హోదా, మెరుగైన జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలంలోని వెంకటాయపల్లిలోని ఎల్.కె. గార్డెన్స్ లో ఈనెల 21 న నిర్వహించనున్న "స్కిల్ డెవలప్మెంట్ సెమినార్" గోడ ప్రతిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా మారితేనే నిజమైన సాధికారత సాధ్యమవుతుంది. వారి ప్రతిభను నైపుణ్యాలతో వెలికితీసే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈ సెమినార్ ద్వారా మహిళలు వ్యాపార,శిల్ప పరిశ్రమల దిశగా అడుగులు వేయగలుగుతారు" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సెమినార్‌లో ఉపాధి అవకాశాలు,ఉచిత శిక్షణా కార్యక్రమాల గురించి వివరణాత్మకంగా తెలియజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు యువతులు,మహిళలు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాపై మండిపడ్డ, రాయుడు చెల్లెలు కీర్తన



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** వినూత కోట చేతిలో హత్య గురి అయినా శ్రీనివాసులు రాయుడు చెల్లెలు అయినా కీర్తన నేడు శ్రీకాళహస్తి డి.ఎస్.పి కలసి మాకు రక్షణ కలిపిచండి సోషల్ మీడియా తప్పుడు ప్రచారాలు మనండి అంటూ వినతి పత్రం సమర్పణ స్పష్టత లేని కీర్తన మాటలు డి.ఎస్.పి కలిసిన కీర్తన మా అన్న చనిపోయి పుట్టెడు దుఃఖంలో మేము ఉంటే మాపై మా కుటుంబం పై సోషల్ తప్పుడు ప్రచారాలు చేస్తూనందున,మాకు ప్రాణ హాని ఉందని చెప్పడం కొసమెరుపు ఎవరి వల్ల ప్రాణహాని,ఏ పార్టీ వల్ల ప్రాణహాని,స్పష్టత లేని కీర్తన మాటలు ఏదో చెప్పాలని వచ్చి ఎందుకు ఏదో విషయం దాస్తున్నట్టుగా వ్యవహరించిన కీర్తన మాటలు పవన్ కళ్యాణ్ అంటే ప్రాణం మాకు, అంటూ గతంలో చెప్పిన కీర్తన నేడు మాకు ప్రాణహాన్ని ఉంది అనడంలో ఆంతర్యమేమిటి ఏ పార్టీ వల్ల ప్రాణహాని ఉందని స్పష్టత లేని కీర్తన మాటలు ఆంధ్ర రాష్ట్రంలో జనసేన సభ్యత్వం తీసుకున్న ఏకార్యకర్తకు అయిన ఏమి జరిగినా హనుమంతుడై ఆగమేఘాలపై అక్కడ వాలిపోతా అన్న పవన్ కళ్యాణ్ రాయుడు విషయంలో ఎందుకు స్పందించడం లేదు పలు అనుమానాలకు దారితీస్తుంది.

## సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలా ఆహ్వాన సంఘం జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు.



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు మెదక్ జిల్లా లో నిర్వహించడం జరుగుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం దేశంలో ఏదైనా ఉందా అంటే అది కేవలం ఒక సీఐటీయూ సంఘామే అనీ గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు సంవత్సరాలుగా సీఐటీయూగా కార్మికుల హక్కులకోసం ఏమి పోరాటాలు నిర్వహించము, ఇంకేనీ నిర్వహించడంలో బలం, బలహీనతలు అన్నీ సమీక్షంచుకొని రాబోయే మూడు సంవత్సరల ప్రణాళిక వేసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ మహాసభలు డిసెంబర్ 7,8,9 తేదీలలో నిర్వహించనున్నట్లు, ముందుగా మహాసభలా జయప్రదం కోసం శనివారం ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆహ్వాన సంఘం కు ముఖ్య అతిథిగా సీఐటీయూ అల్ ఇండియా కోశాధికారి సాయిబాబా, అతిథులుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా పనిచేసిన సుధా భాస్కర్, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శి చుక్కరాములు, పాలడుగు భాస్కర్ హాజరువుతున్నారని ఈ సమావేశం మెదక్ పట్టణంలోని బాలాజీ గార్డెన్స్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశం జయప్రదం చేయడానికి జిల్లాలో సీఐటీయూ నాయకత్వం పూర్తిస్థాయిలో పాల్గొని జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడంలో నిబద్ధతతో పనిచేయాలి

- జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్,ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి ఇతర జిల్లా అధికారులతో కలిసి శాఖల వారీగా అభివృద్ధి సంక్షేమ పథకాలపై సమీక్షించారు. ముందుగా విద్యా వైద్యం, వ్యవసాయం, ఉద్యానవనం, సంక్షేమం, పరిశ్రమలు, వివిధ శాఖల ప్రగతి పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జి మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యతని ఇస్తుందన్నారు. మెదక్ జిల్లాలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో విద్యా, వైద్యంతో పాటు సంక్షేమం ప్రగతి పథంలో ముందుకు పోతున్నాయి అన్నారు, ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మెదక్ జిల్లా అభివృద్ధికి జిల్లా అధికారులు సమిష్టి కృషి ఎంతో దోహదపడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## వన మహోత్సవంలో అందరూ భాగావ్వాములు కావాలి

- జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన అటవీ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆద్వర్యం లో మెగా వన మహోత్సవం కార్యక్రమం లో కార్యక్రమం లో , మొక్కలు నాటిన మంత్రి వివేక్ వెంకటస్వామివచ్చదనాన్ని పెంపొందిస్తూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకర పర్యావరణం అందించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లాలో కలెక్టరేట్ కార్యాలయంలో అటవీ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంత్రివర్యులు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా ఎస్పీ దీవి శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి, డీఎఫ్ఓ జోజి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు కలిసి మంత్రివర్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా 37 లక్షల మొక్కలు నాటాల్సిన లక్ష్యానికి అనుగుణంగా ముందుకు పోతున్నామన్నారు. మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత గురించి ఎవరికి వారు గుర్తిస్తూ, విధిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కల వల్ల పర్యావరణ సమతుల్యం కాపాడడంతో పాటు పచ్చదనం పెరిగి సకాలంలో వర్షాలు కురుస్తాయని, జీవ కోటికి స్వచ్ఛమైన ప్రాణ వాయువు లభిస్తుందని గుర్తు చేశారు. ఇది మనకే కాకుండా మన భవిష్యత్ తరాలకు కూడా ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మొక్కల పెంపకానికి ప్రాధాన్యతను ఇస్తూ పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తోందన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగానే కాకుండా, మన అవసరాల రీత్యా కూడా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటి పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు చల్మెడ పరామర్శ...! ప్రగాఢ సానుభూతి..!!



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన నాగుల వేణు ఇటీవల మృతిచెందగా,అలాగే రుద్రవరం గ్రామానికి మాజీ ఎంపిటిసి అల్వాల పరుశురాములు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను గురువారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి,ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట నాయకులు మ్యాకల రవి, ఆర్ సి రావు, లక్ష్మణ్,బుర్ల రాజశేఖర్,సాయి,నడిగొట్ల హరికృష్ణ,మెడికల్ రాజిరెడ్డి, కట్ట తిరుపతి, కట్ట ఎల్లయ్య, గుండెల్లి శ్రీనివాస్,తునికి నరేష్,పచ్చిమట్ల శ్రీనివాస్, తునికి శ్రీకాంత్,పార్వతి అంజి, కుశ మల్లయ్య,ఎరుకల కిషన్, పార్వతి అంజయ్య,కూతురు బక్కాయ్య,ఎల్లా రాంరెడ్డి , చిట్నూరి అశోక్,మునుకుట్ల సునీల్,అనుముల భరత్, ఎరుకల లచిరెడ్డి,ఎరుకల రాజిరెడ్డి,అభిమన్యు,మెరుగు శ్రీనివాస్,సందీప్ రెడ్డి,ఎర్రం రవి తదితరులు ఉన్నారు.

# రాజా సాబ్ వెనక్కు తగ్గే ఛాన్సే లేదు



డిసెంబర్ 5 విడుదల కాబోతున్న ది రాజా సాబ్ డేట్ మారొచ్చనే ప్రచారం ఒక వర్గంలో మొదలు కావడంతో ప్రభాస్ ఫ్యాన్స్ అయోమయం చెందుతున్నారు. ఇప్పటికే పలు వాయిదాలకు లోనైన ఈ ప్యాన్ ఇండియా మూవీ చెప్పిన టైంకే రావాలని వాళ్ళ కోరిక. ఎవరు ఎలాంటి గాసిప్స్ మొదలుపెట్టినా రాజా సాబ్ రాకలో ఎలాంటి మార్పు ఉండదు. ఒకవేళ సంక్రాంతి ఆప్షన్ ఏమైనా చూస్తున్నారేమో అనే సందేహం రావొచ్చు. కానీ ఆ అవకాశం కూడా లేదు. ఎందుకంటే సోలో డేట్ వదిలేసి అనవసరంగా కాంపిటీషన్ లో దిగడం వల్ల ఓపెనింగ్స్ తో పాటు వసూళ్లు ఎఫెక్టవుతాయి. ప్రభాస్ వస్తాడని అందరూ తప్పుకోలేరుగా. ప్రాక్టికల్ గా చూస్తే డిసెంబర్ 5 బెస్ట్ డేట్. ఎందుకంటే అదే తేదీకి వచ్చిన పుష్ప 2 ది రూల్ రెండు వేల కోట్లకు దగ్గరగా వెళ్ళింది. పరిమిత మార్కెట్లతోనూ యానిమల్ డిసెంబర్ మొదటి వారంలో వచ్చి తొమ్మిది వందల కోట్లకు పైగా కొల్లగొట్టింది. ఇవి సోలోగా రావడం ఎంత పెద్ద మేలయ్యిందో డిస్ట్రిబ్యూటర్లను నిద్రలో లేపి అడిగినా చెబుతారు. ది రాజా సాబ్ కూడా ఇదే స్ట్రాటజీని ఫాలో కావాలని చూస్తోంది. ఎందుకంటే ఒకవేళ సంక్రాంతిని వెళదామనుకునా చిరంజీవి రావిపూడిల మెగా 157 బరిలోనే ఉంటుంది. డాకు మహారాజ్, గేమ్ ఛేంజర్ లను దాటుకుని సంక్రాంతికి వస్తున్నాంతో అనిల్ ఎంత పెద్ద హిట్టు కొట్టాడో చూశాం. రవితేజ కిషోర్ తిరుమల సినిమా, నవీన్ పోలిశెట్టి అనగనగా ఒక రాజు ఆల్రెడీ అఫీషియల్ గా బరిలో ఉన్నాయి. అసలైనది మరొకటి ఉంది. విజయ్ జన నాయగన్ పొంగల్ కే వస్తుంది. రాజా సాబ్ కనక పండగ సీజన్ కోరుకుంటే తమిళనాడు, కేరళలో విజయ్ వల్ల ప్రభాస్ ఓపెనింగ్స్, థియేటర్ పంపకాలు ప్రభావితం చెందుతాయి.

# ఇండియన్ 3 మోక్షానికి రజనీకాంత్ చొరవ ?



లెజెండరీ హీరో అండ్ డైరెక్టర్ కమల్ హాసన్, శంకర్ లు ఎంత బ్యాడ్ ఫేజ్ లో ఉన్నారో చెప్పనక్కర్లేదు. ఇండియన్ 2, థగ్ లైఫ్ డిజాస్టర్లతో లోకనాయకుడు డీలా పడగా భారతీయుడు 2, గేమ్ ఛేంజర్ తో ఇండియన్ స్పిల్బర్గ్ తన భవిష్యత్తునే ప్రశ్నార్థకం చేసుకున్నారు. వీళ్లిద్దరి కలయికలో పెండింగ్ ఉండిపోయిన సినిమా ఒకటుంది. అదే ఇండియన్ 3. ఎప్పుడు ఎక్కడ రిలీజవుతుందో ఎవరికీ తెలియదు. కొందరు థియేటర్ అన్నారు, మరికొందరు ఓటిటి అన్నారు ఇంకొకరు అసలు వెలుగులోకి రాదన్నారు. ఇంత సందిగ్ధం మధ్యలో ఈ ప్యాన్ ఇండియా మూవీ మోక్షానికి రజనీకాంత్ చొరవ తీసుకున్నట్టు చెన్నై టాక్. తనకు బాగా కావాల్సిన లైకా ప్రొడక్షన్స్, శంకర్ తరఫున కమల్ హాసన్ తో మాట్లాడి వీలైనంత వేగంగా దీన్ని బయటికి తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేసుకోమని ముగ్గురితో మాట్లాడి ఒప్పించారట. బ్యాలన్స్ ఉన్న షూటింగ్, రీ రికార్డింగ్, డబ్బింగ్ తదితర కార్యక్రమాలకు ఎలాంటి రెమ్యునరేషన్ డిమాండ్ చేయకూడదనే నిబంధనకు కమల్, శంకర్ ఇద్దరూ అంగీకరించినట్టు వినికిడి. రిలీజయ్యాక ఒకవేళ సినిమా బ్లాక్ బస్టర్ అయితే ముందు వచ్చిన నష్టాలన్నీ పోను ఎంతైతే మిగులుతుందో దాని నుంచి పారితోషికాలు తీసుకోవచ్చట. అధికారికంగా ఇదంతా బయటకు చెప్పలేదు కానీ కోలీవుడ్ వర్గాల్లో టాక్ ఉంది. నిజానికి అసలైన కథ ఇండియన్ 3లోనే ఉంది. కేవలం సీక్వెల్ క్రేజ్ మీద ఎక్కువ డబ్బు చేసుకునే ఉద్దేశంతో ఇండియన్ 2ని చుట్టేయడం దారుణమైన ఫలితాన్ని ఇచ్చింది. ఫలితంగా మూడో భాగం మీద కొంచెం కూడా క్రేజ్ లేకుండా పోయింది. ఇప్పుడు మార్గం సుగమం కావడం అభిమానులకు శుభ వార్తే. సేనాపతి ఉగ్రవాదిగా మారడానికి కారణాలు, బ్రిటిషర్లతో అతను చేసిన యుద్ధాలు తదితర చాలా అంశాలు ఇండియన్ 3లో ఉండబోతున్నాయి. అనిరుద్ రవిచందర్ అందించిన మెయిన్ సాంగ్స్ ఇందులో చూడచ్చు. కమల్ కు జోడిగా కాజల్ అగర్వాల్ దర్శనం కూడా పార్ట్ 3లోనే జరగనుంది. చూద్దాం ఇదెంతవరకు



# 50 కోట్లు కాదు ఇంకా ఎక్కువే ఇవ్వొచ్చు

దర్శకుడు లోకేష్ కనగరాజ్ తాను కూలికి 50 కోట్ల రెమ్యునరేషన్ తీసుకున్నట్టు ఓపెన్ గా ఒక ఇంటర్వ్యూలో చెప్పడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. మామూలుగా స్టార్ డైరెక్టర్లు ఓపెన్ ప్లాట్ ఫార్మ్ మీద పారితోషికాల గురించి మాట్లాడరు. ఒకవేళ మీడియాలో ఏమైనా నెంబర్లు వచ్చినా మౌనంగా దాటేస్తారు తప్పించి ఔననో కాదనో చెప్పరు. కానీ లోకేష్ మాత్రం బాహాటంగా ఒప్పేసుకున్నాడు. అంతే కాదు లియో ఆరు వందల కోట్లు వసూలు చేసింది కాబట్టి ఇప్పుడు తాను తీసుకునే మొత్తాన్ని రెట్టింపు చేయడంలో తప్పేముందని అడిగాడు. మార్కెట్ డిమాండ్ ప్రకారమే తనకిస్తున్నారని వివరణ ఇచ్చాడు.లోకేష్ చెప్పిందాంట్లో పూర్తి లాజిక్ ఉంది. ఎందుకంటే కూలికి ఇంత క్రేజ్ రావడానికి కారణం కేవలం రజనీకాంత్ ఒక్కరే కాదు. ఒకవేళ ఇదే సినిమా ఇదే టైటిల్ తో దర్శకుడు ఏ వెంకట్ ప్రభునో లేదా లింగుస్వామినో అయ్యుంటే పరిస్థితి ఎలా ఉండేది. ఖచ్చితంగా ఇప్పుడున్న హైప్ లో సగం మాత్రమే ఉండేది. ఎందుకంటే రజని పేరు మీదే బిజినెస్ జరగడం లేదు. జైలర్ మినహాయించి పెద్దన్న, పేట, కాలా, కబాలి, 2.0 మన దగ్గర ఏమయ్యాయో అందరికీ తెలిసిందే. కానీ ఇప్పుడు లోకేష్ బ్రాండ్ తలైవర్ కు తోడవ్వడం వల్ల ఎక్కడ లేని అంచనాలు పెరిగిపోయి ప్రాజెక్టుకి అన్ని భాషల్లో క్రేజ్ వచ్చింది. ఈ లెక్కన లోకేష్ కనగరాజ్ అమీర్ ఖాన్ తో చేయబోయే మూవీకి వంద కోట్లకు పైగా తీసుకున్నా ఏ మాత్రం ఆశ్చర్యపోనక్కర్లేదు. కూలి బ్లాక్ బస్టర్ అయితే అంతకన్నా ఎక్కువ ఇచ్చినా షాకవ్వాల్సిన పని లేదు. రెండేళ్లు ఈ మూవీ కోసం కష్టపడిన లోకేష్ దీన్ని ప్యాన్ ఇండియాలో తీయాలనే తాపత్రయం చూపించకపోవడం మెచ్చుకోవాల్సిన విషయం.

# సగం బరువు దించేసుకున్న కింగ్డమ్



జూలై 31 విడుదల కానున్న కింగ్డమ్ బడ్జెట్ పరంగా చాలా పెద్ద ఒత్తిడిని ఎదురుకుంది. విజయ్ దేవరకొండ మార్కెట్ ని మించి వంద కోట్ల దాకా ఖర్చు పెట్టడం థియేట్రికల్ గా రిస్క్ అయ్యింది. ఎందుకంటే బ్లాక్ బస్టర్ టాక్ వస్తే ఓకే. లేదంటే లెక్కలు ప్రమాదంలో పడతాయి. కానీ అలాంటి టెన్షన్ లేకుండా ఓటిటి డీల్ యాభై కోట్లకు క్లోజ్ అయ్యిందని లేటెస్ట్ అప్డేట్. హక్కులు కొన్న నెట్ ఫ్లిక్స్ నాలుగు వారాల విండో కింద ఇంత మొత్తానికి అంగీకారం తెలిపినట్టు వినికిడి. ఇది ఎప్పుడో జరిగిన ఒప్పందమే అయినా తాజాగా వచ్చిన లీక్స్ ప్రకారం చూసుకుంటే రౌడీ బాయ్ మార్కెట్ కు ఇది పెద్ద మొత్తమనే చెప్పాలి. కింగ్డమ్ కు ఇంత క్రేజ్ రావడం వెనుక కారణాలున్నాయి. ఇది రెగ్యులర్ కమర్షియల్ మూవీ కాదు. పీరియాడిక్ సెటప్ లో శ్రీలంక శరణార్థుల బ్యాక్ డ్రాప్ ని తీసుకుని దర్శకుడు గౌతమ్ తిన్ననూరి చాలా ఇంటెన్స్ గా తెరకెక్కించాడు. పైకి యాక్షన్ డ్రామాలా కనిపిస్తున్నా బలమైన బ్రదర్ సెంటిమెంట్ టచ్ చేసేలా ఉంటుందని యూనిట్ వర్గాల మాట. దీనికి తోడు అనిరుద్ రవిచందర్ సంగీతం రక్షణ కవచంలా నిలబడి యూత్ లో క్రేజ్ పెంచుతోంది. ఏ స్థాయి మ్యూజిక్ ఇచ్చాడనేది థియేటర్లలో తెలుస్తుంది కానీ సినిమా మీద బజ్ పెరిగేందుకు తన పేరు బయట రాష్ట్రాల్లో ట్రంప్ కార్డు అయ్యిందనేది వాస్తవం. ఇక మిగిలిన యాభై కోట్లను కింగ్డమ్ థియేటర్ల నుంచి వసూలు చేయాల్సి ఉంటుంది. కాకపోతే రెండు వారాల్లో ఆ టార్గెట్ పూర్తి చేయాలి. ఎందుకంటే కింగ్డమ్ వచ్చిన సరిగ్గా పధ్నాలుగు రోజులకు కూలి, వార్ 2 లు బాక్సాఫీస్ మీద అటాక్ చేస్తాయి.

# హిట్స్ లేవు..
## అయినా క్రేజ్ తగ్గలేదు !

రాశీఖన్నా... చదువులో టాపర్... కలెక్టర్ కావాలనుకుంది. మోడలింగ్ పై ఆసక్తితో స్క్రీన్ ఇండస్ట్రీకి వచ్చానంటోంది. కెరీర్ లో సరైన హిట్ లేకున్నా... స్టార్ హోదా మాత్రం తగ్గలేదు. హిట్లు, ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా 11 యేళ్ళుగా సినిమాల్లో నటిస్తూనే ఉంది. ఊహలు గుస గుసలాడే సినిమాతో పరిచయం అయిన రాశీఖన్నా... హిందీ సినిమాల్లోనూ నటించింది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లోనూ రాశీకి మంచి ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ హాట్ ఫోటోలతో కేక పుట్టిస్తోంది రాశీ ఖన్నా.



# ఫస్ట్ టైం పిడకలు చేశా..
# చాలా హ్యాపీ



కేరళ బ్యూటీ నిత్యామీనన్ బ్యూటీ ఇడ్లీ కడై సినిమాతో బిజీగా ఉంది. ధనుష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో నిత్య పల్లెటూరి అమ్మాయిగా చేస్తోంది. ఈ మూవీకి సంబంధించి ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేసుకుంది. ఇడ్లీ కడై సినిమా కోసం తొలిసారిగా పిడకలు చేశానని చెబుతోంది. మూవీ యూనిట్ పిడకలు చేసేందుకు నువ్వు సిద్ధమేనా అని అడిగినపుడు వై నాట్ అన్నదట. పిడకలు చేసిన తర్వాత రోజే తిరు సినిమాకు గానూ నేషనల్ అవార్డు తీసుకునేందుకు వెళ్లిందట ఈ భామ. అప్పుడు తన వేలి గోర్లలో ఆ పేడ ఇంకా అలాగే ఉందని చెప్పుకొచ్చింది. అది తనకు చాలా సంతోషంగా అనిపించిందట. ఈ సినిమా ద్వారా విభిన్నమైన విషయాలు నేర్చుకున్నానని.. ఈ మూవీ చేయకపోతే ఇంత మంచి అనుభూతి తనకు దక్కేదే కాదని చెబుతోంది. ఇడ్లీ కడై విషయానికి వస్తే తిరుచిత్రంబలం సినిమా తర్వాత ధనుష్ నిత్య కాంబోలో వస్తున్న రెండో మూవీ ఇది. ఇందులో అరుణ్ విజయ్, షాలిని పాండే, సత్యరాజ్, పార్తీబన్, సముద్రఖని కీలక పాత్రలు చేస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ సినిమానికి మ్యూజిక్ అందిస్తున్నారు. అక్టోబర్ 1న ఈ మూవీ రిలీజ్ కాబోతుంది.

# రత్నం హిట్టు కొట్టడం అత్యవసరం



హరిహర వీరమల్లు హిట్టవ్వాలనేది కంటెంట్ మీద ఆధారపడినప్పటికీ దీని గెలుపు పవన్ కళ్యాణ్ కంటే ఎక్కువ నిర్మాత ఏఎం రత్నంకు చాలా అవసరం. ఫ్యాన్స్ కోరుకుంటున్నది కూడా అదే. అయిదేళ్ల నిర్మాణం. లెక్కలేనన్ని వాయిదాలు. వందల కోట్ల ఖర్చు. ఎదురు చూడటంలోనే సంవత్సరాలు గడిచిపోయాయి. అడిగితే పవన్ ఒక కమర్షియల్ మూవీ అయినా సరేననే వారు. కానీ రత్నం లక్ష్యం అది కాదు. ఎప్పటికి మర్చిపోలేని ఒక విజువల్ గ్రాండియర్ ఇవ్వాలి. ఇప్పటిదాకా పవన్ కళ్యాణ్ చేయని జానర్ ని టచ్ చేయాలి. బాహుబలి లాంటి ల్యాండ్ మార్క్ మూవీ తన బ్యానర్ లో ఎప్పటికీ ఉండిపోవాలి. కరోనా బ్రేకులు, మధ్యలో సెట్లకు జరిగిన ప్రమాదాలు, దర్శకత్వం నుంచి క్రిష్ తప్పుకోవడం లాంటి ఎన్నో అవాంతరాలు వీరమల్లుని చాలా ఇబ్బంది పెట్టాయి. ఇంకో ప్రొడ్యూసర్ అయితే మధ్యలోనే చేతులు ఎత్తేసేవారేమో కానీ రత్నం మాత్రం తప్పుకోలేదు. అన్ని సిద్దమనుకుని రిలీజ్ డేట్ ప్రకటించాక కూడా వాయిదా వేయాల్సి రావడం, విఎఫెక్స్ కంపెనీల చుట్టూ తిరగడం ఇలా మాములు నరకం చూడలేదు. ఆఖరికి నెల రోజుల క్రితం జూలై 24 డేట్ అనౌన్స్ చేశాక సైతం ఫ్యాన్స్ అనుమానంగా చూశారంటే ఈ ప్రాజెక్టు ఎన్ని ఆటుపోట్లు, అవమానాలకు గురయ్యిందో అర్థం చేసుకోవచ్చు. వాటికి సమాధానం చెప్పాలి. ఇంత జరిగినా రత్నం కాన్ఫిడెంట్ గా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల హక్కులను గంపగుత్తగా అమ్మకుండా అడ్వాన్స్ పద్ధతి మీద స్వంతంగా రిలీజ్ చేసేందుకు నిర్ణయించుకున్నారట. కొన్ని ఏరియాలు మినహాయించి దాదాపు ఇదే చేస్తారని సమాచారం. ఇన్ని వాయిదాలు, రిస్కులు భరించి హరిహర వీరమల్లు ఎట్టకేలకు థియేటర్లలో అడుగు పెట్టనుంది.

## కేడీసీసీ బ్యాంక్ డిఈ శ్రీనివాస్ ను సన్మానించిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్



**మంథని (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మంథని బ్రాంచ్ కు నూతనంగా బదిలీ, పదోన్నతిపై వచ్చిన డెవలప్ మెంట్ ఎగ్జిక్యూటివ్(డిఈ) సందెబోయిన శ్రీనివాస్ ను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సత్కరించారు. మొట్టమొదటిసారిగా గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ మంథని కి విచ్చేసిన డిఈ శ్రీనివాస్ కు కొత్త శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపినారు. సహకార బ్యాంకు ద్వారా సంఘ సభ్యులకు, రైతులకు త్వరితగతిన రుణాలు అందించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఉదయశ్రీ, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, సంఘ సిబ్బంది పాల్గొన్నారు

## ప్రైమరీ స్కూల్ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్



కాప్రా (ప్రశ్న న్యూస్) చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇందిరా గృహకల్ప కాలనీలో ఇటీవల మంజూరైనటువంటి ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ 1- 5 వ తరగతి ,ను ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ తాత్కాలిక భవనంలో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రపోజల్స్ పంపిస్తే అది ఈనాటికి కార్యరూపం దాల్చి మంజూరైనందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్కూలు రావడానికి విశేషంగా కృషి చేసినటువంటి సోమేశ్వర్ ని పిట్ల కిషన్ ని మిగతా వారిని ప్రభాకర్ అభినందించారు. స్కూలు రావడం వల్ల కాలని ప్రజలందరూ చాలా సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కిషన్ , సోమేశ్వర్ , మహేందర్రెడ్డి, బిక్షపతి ,రామ్దాస్ ప్రహ్లాద రెడ్డి %ఛ% బిజెపి నాయకులు నర్సింగరావు ,డి నాదం ,చెల్లా ప్రభాకర్ లక్ష్మణ్ గౌడ్, ఆనంద్ గౌడ్, ఆర్ వెంకటేశ్వర్లు ,గణేష్ ముదిరాజ్ ,నాగమణి ఎండి అజాజ్, లక్ష్మీనారాయణ ఎస్ అశోక్ బ్రహ్మచారి బి పవన్ కుమార్ ఇస్లావత్ హరినాయక్, ఎన్ జనార్ధన్ మొదలగు వారు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లలో ఆది శ్రీనివాస్ పాత్ర ప్రశంసనీయం

**- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి : పర్శ హన్మాండ్లు**



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలులో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కీలకపాత్ర పోషించారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. గురువారం వేములవాడలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ, బీసీ బిడ్డగా రిజర్వేషన్ల సాధనలో శ్రీనివాస్ ప్రయత్నం అభినందనీయం అన్నారు. కుల గణన తీర్మానాన్ని అసెంబ్లీలో బలపరిచే అవకాశం ఆయనకు రావడం గొప్ప విషయమన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ఐదు లక్షల సహాయం పథకం రూపకల్పనలో ముఖ్యమంత్రిని ఒప్పించి అమలు సాధించిన ఘనత కూడా ఆది శ్రీనివాస్‌దే అని వివరించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 100 కోట్లు మంజూరు చేయించడంలో ఆది శ్రీనివాస్ పాత్రను ప్రశంసిస్తూ, గత ప్రభుత్వ హయాంలో ఆలయానికి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ఇప్పుడు రాజనీతిక కృషితో విస్తరణ, రోడ్లు, సౌకర్యాలు కల్పించారని హన్మాండ్లు పేర్కొన్నారు. "ఆది శ్రీనివాస్‌కు దక్కుతున్న గౌరవం యావత్ బీసీలకు దక్కిన గౌరవమే" అంటూ హన్మాండ్లు గర్వంగా వ్యాఖ్యానించారు. బీసీ బిల్లుపై కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టమైందన్నారు. అసెంబ్లీలో టీఆర్ఎస్, బీజేపీలు మద్దతిచ్చినా, బయట వేరేలా ప్రచారం చేస్తున్నాయన్నారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "కుల గణన రాహుల్ గాంధీ ఆలోచన అని, దానికి అనుగుణంగా తెలంగాణలో లెక్కలు తీస్తే బీసీల జనాభా 56.36 శాతంగా నిర్ధారణ అయిందన్నారు. రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరిని ఎండగట్టి, ముస్లిం రిజర్వేషన్ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటున్నారని విమర్శించారు. గుజరాత్‌లోనూ ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చిన విషయం గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి బీసీల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు. బీసీ బిల్లును రాజ్యాంగ సవరణతో పార్లమెంట్‌లో ఆమోదించి, తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వీరవేణి మల్లేష్ యాదవ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు తడక కమలాకర్, రాష్ట్ర నాయకులు చిలుక రమేష్, వేములవాడ పట్టణ అధ్యక్షుడు సాయికుమార్, బీసీ యువజన సంఘం నాయకులు నంద్యాడాపు శ్రీనివాస్, కంచర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## తాటిచెట్టు పైనుంచి పడి గీతా కార్మికుడికి తీవ్ర గాయాలు

**- ప్రభుత్వం సహాయం అందించాలని కోరిన స్థానికులు**



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లికి చెందిన గీతా కార్మికుడు విక్కుర్తి పర్శరాములు (55) తాటిచెట్టు పైనుంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో శాత్రాజుపల్లి నుంచి ఎదురుగట్లకు వెళ్లే రోడ్డుపై ఉన్న పెద్దమ్మ గుడి వెనుక తాటిచెట్టు మీద ఎక్కి కల్లు గీత గీస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలపాలైన పర్శరాములను స్థానికులు వెంటనే వేములవాడ మహాలక్ష్మీ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కడు పేదరికంలో ఉన్న సదరు గీతా కార్మికుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని పలువురు గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పోచమ్మ గుడి పక్కన ప్రభుత్వ భూమికి ఎసరు..?

**- కోట్లాది విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం...**

**- కన్ను పడితే... ప్రభుత్వ భూములు కబ్జానే...?**

**- ప్రభుత్వ సంపద... పెద్దల పాలు...**

**- పట్టా కొరకు.... కార్యాలయాల చుట్టూ పడి గాపులు...**

**- డబ్బు,అధికారం,రాజకీయ పలుకుబడితో ఇద్దరు వ్యక్తుల కబ్జా...**





**మంథని (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ భూమిలో పేదోడు ఒక చిన్న గుడిసె వేసుకుంటా అంటే మాత్రం రూల్స్... రెగ్యులేషన్ అంటూ... మాట్లాడడం చూస్తుంటాము. అదే ఒక పెద్దోడికి మాత్రం రూల్స్ రెగ్యులేషన్ మాత్రం ఉండవు. ప్రభుత్వ భూములు కొన్ని చోట్ల కబ్జాకు గురి అవ్వటం మనం ఎక్కడో ఒక్క చోట చూస్తుంటాము. ప్రస్తుత మార్కెట్ భూములకు ధరకు రెక్కలు రావటంతో అక్రమ మార్కుల కన్ను ప్రభుత్వ భూముల పై పడింది. దీంతో ప్రభుత్వలను తమ పలుకుబడి ఉపయోగించి తప్పుడు పత్రాలతో రాజకీయ అండ దండలతో కబ్జాలు చేస్తుండడం అక్కడక్కడ చూస్తుంటాం వింటుంటాం. ఇదే మంథని మండలంలో కొందరు అక్రమార్కుల కన్ను కూడా ప్రభుత్వ భూముల పై పడినట్టుగా తీవ్రంగా చర్చించుకుంటున్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. బహిరంగ మార్కెట్ లో భూముల్లో రెక్కలు రావడంతో ఖాళీగా ఉంటే చాలు కబ్జా పాల్పడుతున్నారు. మంథని పట్టణంతో పాటు మండలంలోనీ ప్రభుత్వ భూముల పై పెద్దల కన్ను పడింది. రాజకీయ పలుకుబడి,అధికారుల అండ దండలు తమ పలుకుబడి ఉపయోగించికుంటు... ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తున్నారు. పట్టణంలోని ఎస్టీ బాలికల గురుకుల ముందు పోచమ్మ గుడి కి అనుకోని ఉన్న... కోట్లాది రూపాయల విలువ గల ప్రభుత్వ భూమి పై ఇద్దరు కన్ను పడిన్నట్లు మంథనిలో చర్చించుకుంటున్నారు. వీరికి రాజకీయ పలుకుబడి అధికారుల అండ దండలతో కబ్జాకు ప్రయత్నిస్తున్నట్టు స్థానికంగా విమర్శలు వెళ్ళువెత్తుతున్నాయి. రికార్డ్ ల్లో తప్పుడు రాతలతో తప్పుడు పత్రాలు సృష్టించి... ఏకంగా ప్రభుత్వభూమి పై వారి కన్ను పడింది. అధికారం ఎటు ఉంటే అటు వెళ్ళి... అవినీతి అక్రమాలకు పాల్పడడం పరిపాటిగా మారిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూముల పై అధికారులు నిఘా పెట్టడంలో విఫల మయ్యారని స్థానికుల నుండి విమర్శలు వస్తున్నాయి. భూమి ఇళ్లు లేని పేదోడికి ఒక గుంట కొరకు భూమి ఇవ్వమని దరఖాస్తు చేసుకుంటే... మాత్రం కారణాలు చెప్తారు. అదే కాసులుతో రాజకీయ అండ దండలతో వస్తె మాత్రం ఎలాంటివి వర్తించవున్నట్టుగా ఉందనీ ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ భూముల కబ్జా పై అడ్డుకట్ట వేస్తారో..? పట్టాలు చేసి ఇస్తారో...? ప్రభుత్వ భూములను కాపాడతారో..? వేచి చూడాలని ప్రజలు అనుకుంటున్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం సాధ్యం

**- ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ : శేఖర్**



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు ఏడాదికి రూ. 1.5 లక్షల వరకు నికర ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి. శేఖర్ తెలిపారు. బోయినిపల్లి మండలం మర్లపేట గ్రామంలోని ఆయిల్ పామ్ తోటలను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. రైతులకు రూ. 20కే మొక్కలు లభిస్తాయి. ఎకరాకు రూ. 4,200 వరకు నిధులు అందిస్తున్నాం. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై ఎస్సీ,ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90 శాతం, ఓసీలకు 80 శాతం రాయితీలు అందిస్తున్నాం," అని వివరించారు.

### నీటి వనరులు,నేల తేమ అనుకూలం

"మన జిల్లాలో తగిన నీటి వనరులు, నేల తేమ ఉన్నందున ఆయిల్ పామ్ సాగు అనుకూలంగా ఉంటుంది. రైతులు ముందుకు వచ్చి ఈ సాగు చేపట్టాలి," అంటూ శేఖర్ పిలుపునిచ్చారు. ఆయన పంట దిగుబడి, కోత, మార్కెట్ అవకాశాలపై కూడా రైతులకు అవగాహన కల్పించారు.

### లక్ష్యం - 2000 ఎకరాలులి

జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమ అధికారి లత మాట్లాడుతూ, ఈ ఏడాది జిల్లాలో 2000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే పెద్ద సంఖ్యలో రైతులు దరఖాస్తు చేశారని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ అధికారులు లోకేష్,గోవర్దన్, ఫ్రీ యూనిక్ కంపెనీ జిల్లా మేనేజర్ ప్రేమ్ సాయి, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

## బండి ప్రత్యేక చొరవతో కొదురుపాకలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**- బోరు మంజూరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ కి గ్రామస్తుల కృతజ్ఞతలు**



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవతో రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని కొదురుపాక గ్రామంలో గ్రామ ప్రజలను పట్టిపీడిస్తున్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా బోరు మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు బోరు మంజూరు విషయంలో కృషి చేసిన బండి సంజయ్ కుమార్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భాజపా మండలాధ్యక్షులు పర్శరాములు మాట్లాడుతూ కొదురుపాక గ్రామస్తులు చాలా కాలంగా తాగునీరు సమస్యతో బాధపడుతున్న విషయం తెల్సిందే..! కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రత్యేక చొరవతో బోరు మంజూరు పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని,ఇది "బండి సంజయ్ ప్రజా ప్రతినిధిత్వం,స్పందనకు నిదర్శనం,గ్రామాల అభివృద్ధిలో ఆయన పాత్ర మరువలేనిది"అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురాములుతో పాటుగా భాజపా జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహాచారి,బూత్ అధ్యక్షులు కొంకటి హరీష్, సారంపల్లి రాజు,తిరుపతి, రాజు,శేఖర్ తదితర నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేముల మహన్యకు చికిత్స నిమిత్తం రూ.1 లక్ష ఎల్ఓసి మంజూరు పత్రం అందజేత

**- చొప్పదండి ఎమ్మెల్యే : మేడిపల్లి సత్యం**



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)**రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, కోరెం గ్రామానికి చెందిన వేముల మహన్య కు వైద్య చికిత్స కోసం రూ. 1 లక్ష ఎల్ఓసి (లెటర్ ఆఫ్ క్రెడిట్) ను చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ "ప్రజలకు అత్యవసర సమయాల్లో వైద్య సాయం అందించేందుకు నేను ఎప్పుడూ సిద్ధంగా ఉన్నాను. ఆరోగ్యం పట్ల ప్రభుత్వ సహకారం అందించేలా కృషి చేస్తున్నాను" అని తెలిపారు. వేముల మహన్య కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ అక్కెనపల్లి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## నల్ల పోచమ్మ తల్లిని దర్శించుకున్న ఎంపీ ఈటల



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి కింది బస్తి లోని శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో బోనాల ను అత్యంత భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మామిళ్ళ నర్సింగ్ రావు,సాకరబోయిన వెంకటేష్,నడికొప్పు దర్శన్,బలమల్లేష్ లు ఎంపీ ఈటల రాజేందర్ ను శాలువా కప్పి సన్మానించారుఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్,ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి,ప్రేమ్,మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి మురళీధర్ గుప్త,తెలంగాణ రాష్ట్ర బీజేపీ నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి,జగన్ గౌడ్,మేడ్చల్ మున్సిపాలిటీ నాయకులు లవంగ శ్రీకాంత్,సర్వేశ్వర రెడ్డి,మహేష్ గౌలికర్,బొజ్జ వంశీ రెడ్డి,పురుషోత్తం,పికెట్ మల్లికార్జున్,పురుషోత్తం,ఎల్లంపేట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడికృత్తికకు సర్వం సిద్ధం





**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** విద్యుత్తు వెలుగులతో కాంతులీనుతున్న విజ్ఞానగిరి శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున విజ్ఞానగిరి వద్ద నిర్వహిస్తున్న ఆడికృత్తికకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. తిరుత్తణి కి వెళ్లలేని భక్తులందరూ దగ్గరలో ఉన్న శ్రీకాళహస్తి విజ్ఞానగిరికి వచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు. ఐదురోజులు పాటు విజ్ఞానగిరి వద్ద జరిగే ఉత్సవాలకు ఏర్పాట్లు ఘనంగా సిద్ధం చేశారు. భక్తులకు శీఘ్రంగా సంతృప్తికర దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి.

# ముగ్గురి వద్దనే వెయ్యి కోట్లు

## - వీళ్లు దొరికినోళ్లు, దొరకనోళ్లు ఇంకెంత మందో.?

- అధికారుల అవినీతి ఇంతుంటే పాలకుల అవినీతి ఇంకెంతుందో.?
- కెసిఆర్ ప్రభుత్వంలో భారీగా పెరిగిన అధికారుల అవినీతి
- సిబ్బంది నుండి ఉన్నత అధికారుల వరకు మామూళ్ల వాటాలు, అవినీతి దందాలు
- ప్రజల సొమ్ము దొరికినోడికి దొరికినంత దోచుకు తింటున్న వైనం
- అవినీతిని కట్టడి చేయవలసిన పాలకుల ప్రోత్సాహంతోనే ఇంత దోపిడీ


మురళీధరావు


నూనె శ్రీధర్


హరిరామ్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాళేశ్వరం ప్రాజెక్టు కొందరు నీటిపారుదల శాఖ అధికారులకు వరంగా మారింది. కోట్ల రూపాయల నిధులను కూడబెట్టారనడానికి ఏసీబీ గత కొంతకాలంగా జరుపుతున్నదాడులతో స్పష్టమవుతుంది. ఇప్పటి వరకూ కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన అధికారులందరూ వందల కోట్లు కూడబెట్టుకున్నారు. దీన్ని బట్టిచూస్తుంటే కాళేశ్వరం ప్రాజెక్టు అధికారులకు కాసుల వర్షం కురిపించిందని ఏసీబీ దాడుల ద్వారా అర్థమవుతుంది. అధికారులకె వందల కోట్లు వచ్చాయంటే ఇక పాలకులకు ఎన్ని వందల కోట్లు వచ్చాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటి వరకు ముగ్గురు నీటి పారుదల శాఖ అధికారులపై ఏసీబీ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ముగ్గురి నుంచి దాదాపు వెయ్యి కోట్ల రూపాయల అక్రమ ఆస్తులు కనుగొన్నారంటే ఏ రేంజ్ లో అవినీతికి పాల్పడ్డారో అర్థమవుతుంది. ప్లాట్లు, వ్యవసాయ భూములు, విల్లాలు, ఖరీదైన కార్లు, బంగారం, వెండి ఆభరణాలు చూసి ఏసీబీ అధికారులే అవాక్కవుతున్నారు. ఈ రేంజ్ లో సంపాదించారంటే కాళేశ్వరం ఎంత వరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

### - మురళీధరావు ఆస్తులు చూస్తే...

నీటిపారుదలశాఖ మాజీ ఈఎన్సీ మురళీధరావు ఇంట్లో జరిపిన సోదాల్లో కోట్లాది రూపాయల అక్రమార్జన బయటపడిందని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. ఆయన ఆస్తుల విలువ ఆరువందల వందల కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ లో విలువైన భూములు, ఇంటి స్థలాలలతో పాటు పవర్ ప్రాజెక్టు, ఖరీదైన ఫ్లాట్లు, ఇంటి స్థలాలు, విల్లాతో పాటు బంగారం, వెండి ఆభరణాలను ఉన్నట్లు కనుగొన్నారు. ఇక బ్యాంకు లాకర్లను కూడా తెరవాల్సి ఉంది. అది తెరిస్తే ఇంకా ఎన్ని ఆస్తులు బయటపడతాయోనంటున్నారు. హైదరాబాద్ లోని మోకిలాలో 6,500 చదరపు గజం స్థలం ఉంది. అలాగే హైదరాబాద్ శివార్లలో పదకొండు ఎకరాల సాగు భూమి కూడా ఉంది. జహీరాబాద్ లో టూ కేవీ సోలార్ పవర్ ప్రాజెక్టు, బంజారాహిల్స్, యూసఫ్ గూడ, కోకపేట, బేగంపేట్లో నాలుగు ఫ్లాట్లు, నాలుగు ఇళ్లస్థలాలను ఉన్నట్లు సోదాల్లో ఏసీబీ అధికారులు కనుగొన్నారు. వరంగల్, కోదాడా ప్రాంతంలోనూ అపార్ట్ మెంట్లతో పాటు కొండాపూర్ లోని ఖరీదైన విల్లా ఉంది. అయితే లాకర్ ఓపెన్ చేస్తే మరిన్ని ఆస్తులు బయటపడే అవకాశముందని భావిస్తున్నారు.

### - నూనె శ్రీధర్ ఆస్తులు రెండు వందల కోట్లు..

ఇక కొన్నాళ్ల క్రితం మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూనె శ్రీధర్ అక్రమార్జనను కూడా ఏసీబీ అధికారులు వెలికి తీశారు కాళేశ్వరం మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గా ఉన్ననూనె శ్రీధర్ భారీగా ఆస్తులను కూడబెట్టినట్లు సోదాల్లో కనుగొన్నారు. అమీర్ పేట్ లో కమర్షియల్ కాంప్లెక్స్ తో పాటు ఇక తెల్లాపూర్ లో విల్లాతో పాటు కరీంనగర్ లో మూడు ఇళ్లు, షేక్ పేట్ లో ఒక ఫ్లాట్, ఇంకా వ్యవసాయ భూములున్నాయని ఏసీబీ అధికారులు తెలిపారు. ఇవి కాకుండా కరీంనగర్, హైదరాబాద్, వరంగల్ లలో పందొమ్మిది ఓపెన్ ప్లాట్లు ఉన్నాయని ఏసీబీ దర్యాప్తులో వెల్లడయింది. దీంతో పాటు పదహారు ఎకరాల వ్యవసాయ భూమి కూడా ఉంది. ఇక కార్లు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు కూడా ఉన్నాయి. వీటి మొత్తం ఆస్తుల విలువ రెండు వందల కోట్లకుపైగానే ఉంటుందని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. లాకర్లు ఓపెన్ చేసిన తర్వాత మరిన్ని ఆస్తులు బయటపడ్డాయి.

### - హరిరామ్ ఆస్తులివీ..

కాళేశ్వరం మాజీ ఈఎన్సీ హరిరామ్ ఇంటిపై ఏసీబీ సోదాలు కొంతకాలం క్రితం జరిగాయి. హరిరాం ఇళ్లు, ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్లపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ ఆస్తుల విలువ రెండు వందల కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేశారు. హరిరామ్ భార్య కూడా ఇంజనీరింగ్ అధికారిగా పనిచేస్తుండటంతో ఆమె ఇళ్లలోనూ తనిఖీలను నిర్వహించారు. హరిరామ్ కు శామీర్ పేట్ లో ఒక విల్లాతో పాటు, కొండాపూర్ లో విల్లా, శ్రీనగర్ కాలనీ లో ఒక ఫ్లాట్ తో పాటు మాదాపూర్ లోనూ మరొక ఫ్లాట్ ఉందని తేల్చారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోనూ కమర్షియల్ స్పేస్ ను హరిరామ్ కొనుగోలు చేసినట్లు ఏసీబీ అధికారులు కనుగొన్నారు. మర్కూక్ మండలంలో ఇరవై ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమితో పాటు, పటాన్ చెర్వులో ఇరవై కుంటల భూమి, హైదరాబాద్ లోని శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్లు ఇళ్లు, బొమ్మల రామారంలో ఒక ఫామ్ హౌస్, కుత్బుల్లా పూర్ లో ఓపెన్ ఫ్లాట్, మిర్యాలగూడలో ఒక ఫ్లాట్, మామిడితోట, రెండు బీఎండబ్ల్యూ కార్లు, బంగారు ఆభరణాలు, నగదు కూడా ఉన్నట్లు గుర్తించారు. ఇలా ముగ్గురి ఆస్తుల విలువే మార్కెట్ విలువ వెయ్యి కోట్ల రూపాయలకు పైగానే ఉండటంతో కాళేశ్వరం కాసులు కురిపించిందని చెప్పకనే చెప్పొచ్చు.

# విజయ డైరీలో తిష్ట వేసిన అక్రమార్కులు

- చర్యలు మరిచిన ఉన్నత అధికారులు
- డెయిరీ ప్రతిష్టకు దెబ్బ, ఆదాయానికి గండి
- డిప్యూటేషన్ పై రావడం దోచుకోవడం
- ఫ్యాక్టరీ ఇంజనీర్ అయ్యుండి ఎండి పేషి లో డ్యూటీ




**తార్నాక (ప్రశ్న న్యూస్)** ఇంటి దొంగలను ఈశ్వరుడు కూడా పట్టుకోలేడు అన్న చంద సంగ మారింది లాలాపేట లోని తెలంగాణ విజయ డెయిరీ పరిస్థితి. దోచుకున్నోడికి దోచుకున్నంత అన్నట్లుగా విజయ డెయిరీలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. స్టేట్ విజిలెన్స్ అధికారులు కూడా దీనిపై దృష్టి సారించకపోవడంతో ఇక్కడ విధులు నిర్వహించే సిబ్బంది అధికారులు అందిన కాడికి దండుకొని దోచుకుతింటున్నారని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. డిప్యూటేషన్ పై వచ్చి విజయ డెయిరీలో అక్రమాలకు పాల్పడు తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సంస్థ ఉద్యోగులు, సిబ్బంది ముఖ్యమంత్రిని కోరుతున్నారు. నాలుగేండ్ల క్రితం జాయింట్ రిజిస్టర్ స్థాయిలో డిప్యూటేషన్ పై వచ్చిన మనోజ్ కుమార్ ఇక్కడే తిష్ట వేశారని గత మే లోనే డిప్యూటేషన్ ముగిసినందున ఆయనను తిరిగి మాతృసంస్థ అయిన కో ఆపరేటివ్ శాఖకు పంపాలని ప్రభుత్వం ఆదేశించిందని అయినప్పటికీ ఎండీ తన స్నేహితుడని వెళ్లే ప్రసక్తే లేదని భీష్మించుకు కూర్చున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీలో ఇంజనీర్ గా విధులు నిర్వహించే రాజశేఖర్ ఇప్పుడు ఒక్కసారిగా ఎండి పేషి లో విధులు నిర్వహించడం ఏమిటని ఎలాంటి అనుభవం లేకుండా ఎండి కార్యాలయంలో విధులు నిర్వహించడం కోసం ట్రేడ్ యూనియన్ మాజీ జీఎస్ విజయ్ కుమార్ ఇతర అధికారులు ఇతనిని ఎండి కార్యాలయంలో డ్యూటీ వేశారని దానితో దోపిడీకి సుగమ మార్గం ఏర్పడిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. కొంతమంది ఓ వర్గంగా ఏర్పడి సంస్థ ఎండీ, చైర్మన్ కు తప్పుడు సమాచారం ఇస్తున్నారని పేర్కొన్నారు. విజయ డెయిరీ అభివృద్ధికి ఆటంకంగా మారారని ప్రైవేటు డెయిరీ లతో చేతులు కలిపి నిబంధనలనకు విరుద్ధంగా సిబ్బందిని బదిలీచేస్తూ భారీగా డబ్బు వసూలు చేస్తున్నారని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. వీరి అవినీతి అక్రమాలపై విజిలెన్స్ ఎంక్వైరీ చేయించాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఉన్నత అధికారులను మేనేజ్ చేసుకుంటూ అందిన కాడికి దండుకొని డెయిరీ అభివృద్ధికి నష్టం కలిగిస్తున్నారని పేర్కొన్నారు.

# మరో కంపెనీలో అగ్నిప్రమాదం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ సనత్‌నగర్‌లోని జింకలవాడలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. జింకలవాడలో ఉన్న డ్యూరోడైన్ ఇండస్ట్రీస్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా అవి పరిశ్రమ మొత్తానికి విస్తరించడంలో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో ఆ ప్రాంతంలో నల్లని పొగ దట్టంగా అలముకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆరు ఫైర్‌ఇంజన్లు, రోబో సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. అయితే షార్ట్‌సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగలేదు. కానీ పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఓయూ అధికారులు

**కాలేజీ కి యూనివర్సిటీ కి కోర్టులో కేసు ఉందని సర్టిఫికెట్లు ఇవ్వకుంటే విద్యార్థుల భవిష్యత్తు ఏంటి.?**

**విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుంటే ఉన్నత చదువులు, ఉద్యోగాలు ఎలా వస్తాయి**

**హిందీ మహావిద్యాలయము (2019%-%2022 బ్యాచ్) విద్యార్థులకు సర్టిఫికెట్ల జారీపై తక్షణ చర్య తీసుకోండి**






**ఓయూ(ప్రశ్న న్యూస్)** కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో కాలేజీలు యూనివర్సిటీలు చెలగాటమాడుతున్నాయి. పాస్ అయిన తర్వాత సర్టిఫికెట్లు ఇవ్వడానికి యూనివర్సిటీ అధికారులు నిరాకరించడంతో విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా తయారయ్యాయి. దానితో విద్యార్థులు మానసిక ఆవేదనకు గురవుతున్నారు. 2019 - 2022 విద్యా సంవత్సరాల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయంకి అనుబంధంగా ఉన్న హిందీ మహావిద్యాలయములో తమ విద్యను పూర్తి చేసిన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఉద్యోగాల కోసం పూర్తిస్థాయి సర్టిఫికెట్లు ఇవ్వాల్సిన బాధ్యత యూనివర్సిటీది. ఉస్మానియా విశ్వవిద్యాలయం హిందీ మహావిద్యాలయము మధ్య నడుస్తున్న కోర్టు వివాదం కారణంగా, సంబంధిత విద్యార్థులకు ఇప్పటి వరకు సర్టిఫికెట్లు జారీ చేయబడలేదు. తమ విద్యను విజయవంతంగా పూర్తి చేసిన వందలాది మంది విద్యార్థులు, సర్టిఫికెట్లు లేకపోవడం వల్ల ఉన్నత విద్యా అవకాశాలు, ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నామని తీవ్ర మానసిక ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల జీవితాలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం సంబంధిత అధికారులందరినీ, విద్యార్థుల హితాన్ని దృష్టిలో ఉంచుకొని అత్యంత త్వరగా పరిష్కరించి వాయిదా లేకుండా తక్షణంగా సర్టిఫికెట్లు జారీ చేయవలసిందిగా విద్యార్థులు కోరుతున్నారు. విద్య అనేది సమాజ అభివృద్ధికి పునాదిగా ఉంటుంది. అందువల్ల, విద్యార్థుల హక్కులను, భవిష్యత్తును ఓయూ అధికారులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల పక్షాన సానుకూలంగా పరిశీలించి, హిందీ మహావిద్యాలయము 2019- 2022 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు తక్షణంగా విడుదల చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

# ఉప్పల్ సీఐ ఎలక్షన్‌రెడ్డి సస్పెండ్

## - హెచ్‌సీఏ వ్యవహారంలో సస్పెన్షన్

- హెచ్‌సీఏ అక్రమాల వ్యవహారంలో ఏసీబీ సోదాల సమాచారాన్ని లీక్ చేశారనే ఆరోపణ
- హెచ్‌సీఏ సెక్రటరీ దేవరాజ్ కు సహకరించినట్టు విచారణలో వెల్లడి
- సీఐ ఎలక్షన్ రెడ్డి ని టెర్మినేట్ చేయాలని ప్రజల డిమాండ్
- దేవరాజ్ అరెస్ట్ కు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పోలీసు శాఖలో కొంతమంది అధికారులు అధికారం అడ్డం పెట్టుకొని ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేయడంతో పాటు రాజకీయ నాయకులకు తొత్తులుగా మారి ఉద్యోగ ధర్మాన్ని అమ్ముకోవడం లేదా నిరుపయోగం చేయడం జరుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పోలీసు శాఖలో అధికారులు అవినీతిపరులైతే పరిస్థితి సమాజంపై చాలా తీవ్రంగా ఉంటుందని అందులో భాగంగా కొంతమంది అధికారుల వ్యవహారం చాలా ఇబ్బందికరంగా మారుతుంది. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపవలసిన పోలీసు శాఖ అధికారులు అక్రమార్కులకు అండగా ఉంటూ అమాయకులను బలి చేయడం పై వాళ్ళ మనసేలా ఒప్పుకుంటుందో వాళ్లకే తెలియాలి. నికాస్ అయిన పోలీసుగా ఉండాలని చాలామంది కోరుకుంటారు కొంతమంది దానినే అడ్డం పెట్టుకొని అవినీతి అక్రమాలు చేస్తూ శాఖకు చెడ్డ పేరు తెస్తున్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) స్కామ్ విషయంలో పలువురి పేర్లు బయటకు వస్తున్నాయి. ఉప్పల్ సీఐ ఎలక్షన్‌రెడ్డిపై తాజాగా సస్పెన్షన్ వేటు పడింది. ఇక హెచ్‌సీఏ జనరల్ సెక్రెటరీ దేవరాజు అరెస్టుకు కూడా సీఐడీ రంగం సిద్ధం చేసింది. దేవ్‌రాజ్‌కు సహకరించిన ఎలక్షన్‌రెడ్డి సీఐడీ సమాచారాన్ని ముందుగానే లీక్ చేసినందుకు సస్పెండ్ అయ్యారు. హెచ్‌సీఐ అక్రమాలపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ మరోసారి సీఐడీకి ఫిర్యాదు చేసింది. ఇందులో రాజకీయ నాయకుల ప్రమేయంపై కూడా విచారణ జరపాలని కోరింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో అక్రమాల వెనుక కేటీఆర్, కవిత హస్తముందని, సీఐడీ డీజీ చారుసిన్హాకు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి గురువారెడ్డి ఫిర్యాదు చేశారు. హెచ్‌సీఏ అక్రమాల్లో మరికొందరి పాత్ర ఉందని, విచారణ జరిపి జాన్ మనోజ్, విజయానంద్, పురుషోత్తం అగర్వాల్, సురేందర్ అగర్వాల్, వంకా ప్రతాప్‌లపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో పెద్దల అండదండలతో జగన్‌మోహన్ రావు హెచ్‌సీఏ ప్రెసిడెంట్ అయ్యారన్నారు. ఇలా ఉద్యోగ ధర్మాన్ని వీడే అధికారులను పర్మినెంట్ గా ఉద్యోగం నుంచి తొలగించాలని లేకుంటే తిరిగి ఉద్యోగంలో చేరిన తర్వాత మరిన్ని అవినీతి అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని టెర్మినేట్ చేస్తే విధులు నిర్వహించే అధికారులకు భయం ఏర్పడి సక్రమంగా నిర్వహిస్తారని ప్రజలు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588